Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు  స్థాపితం: 1930  జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

*Longest Living Newspaper in Telugu Journalism*




# జమీన్ రైతు




సంపుటి: 80 • సంచిక: 47 • 6-11-2009 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

• కలిసి వుంటే కలహమే!

## స్వంత కుంపటి వెలిగిస్తున్న జగన్

- కాంగ్రెస్‌పార్టీ కంటే తానే ఎక్కువన్న ఉన్మత్త భావన.
- 70 నుంచి 100 మంది ఎమ్మెల్యేలు తనతో వున్నారన్న ధైర్యం.
- అధిష్టానంతో తాడోపేడో తేల్చుకోవాలని అభిమానుల ఒత్తిడి.
- పులివెందుల టిక్కెట్ ఇచ్చేవరకు వేచి చూడాలన్న నిర్ణయం.



రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలు పూటకొక మలుపు తిరుగుతున్నాయి. క్షణానికొక రంగు మార్చుకొంటున్నాయి. ఆంధ్ర ముఖ్యమంత్రిత్వం తన వారసత్వపు హక్కు అన్న ఆలోచన వైఎస్. జగన్‌ను విడనాడడం లేదు. కేంద్ర నాయకత్వం, సోనియా గాంధీతో సహా ఎన్ని సంకేతాలు పంపినా, ఎంత స్పష్టంగా విడమరిచి చెప్పినా జగన్ మొండి పట్టు మాత్రం వీడడం లేదు. చాక్లెట్ కావాలని మారాం చేసే చిన్నపిల్లవాడి వలె, ముఖ్యమంత్రి కుర్చీ అడుగుతున్నాడు జగన్.

రెండు వారాల క్రితం ఢిల్లీ పర్యటనకు వెళ్లినప్పుడు అధిష్టానం ఆయనకు కుండబ్రద్దలు కొట్టినట్లు తేల్చి చెప్పింది. ఇప్పట్లో నీ కోరిక తీర్చడం సాధ్యం కాదని ముఖాన చెప్పింది. కొంతకాలం వేచి వుండమని సలహా కూడా ఇచ్చింది. ఆ నిర్వేదంలో ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన జగన్, తనకింకా 36ఏళ్లే కాబట్టి, సోనియాగాంధీ నేతృత్వంలో ప్రజలకు మరింత సన్నిహితమై, కాంగ్రెస్‌పార్టీ కోసం కష్టపడి పని చేస్తానని ప్రకటన చేశాడు. తన ముఖ్యమంత్రిత్వం కోసం వైఎస్ అభిమానులెవరూ ప్రకటనలివ్వవద్దని, గొడవ సృష్టించవద్దని విజ్ఞప్తి చేశాడు. ఇంతటితో ఈ వివాదం సమసిపోతుందని భావించారు అందరూ.

కానీ పరిస్థితి అట్లా లేదు. ఎంత అణుచుకొందామన్నా జగన్‌లో ఆ కోరిక చల్లారడం లేదు. ఆపుకోలేని తమకంతో వేగి పోతున్నాడు. బెంగుళూరులో కాలు నిలవలేదు. హైదరాబాదులోని ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసు వదలబుద్ధి కావడం లేదు. తన తండ్రి అనుభవించిన అధికారం, దానితో అంది వచ్చిన ఫలాలు ఆ యువకుడికి నోరూరిస్తున్నాయి. పక్కన చేరిన భజన బృందం ఆయన తాన అంటే, తందానా అంటున్నది. కాంగ్రెస్‌లోని పార్టీ కంటే తానే ఎక్కువ అనే ఉన్మత్త భావన ఆవహిస్తున్నది. దాని ఫలితమే, స్వంత కుంపటి ఆలోచన.

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో ప్రజారాజ్యంతో పొత్తు పెట్టుకోవాలని పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ చేసిన ప్రయత్నం కాంగ్రెస్‌లో అగ్గి పుట్టించింది. చిరంజీవిని పార్టీలోకి తెచ్చి, జన సమ్మోహనలో తనకు పోటీగా నిలపాలని చూస్తున్నారని జగన్‌కు కలిగిన అనుమానం, ఆ నిప్పును దావానలం వలె మార్చింది. చిరంజీవి కాంగ్రెస్‌లోకి రావడం అంటే, తన పదవీ అవకాశాలు శాశ్వతంగా మూసుకపోయినట్లే అని భయపడి పోయాడు జగన్. వైఎస్ మరణం తర్వాత రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీలో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగగలిగిన, ఆకర్షణ శక్తి కల్గిన నాయకుడు ఎవడూ లేడు కాబట్టి, కాంగ్రెస్ అధినాయకత్వం ఏ ఎన్నిక వచ్చినా తన కాళ్ల దగ్గరకు రాక తప్పదన్నది జగన్ తనకు తానుగా ఏర్పరచుకొన్న అభిప్రాయం. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల ప్రచారానికి తన అవసరం ఏర్పడుతుందని, అప్పుడైనా తన మాట వినక తప్పదని అనుకొన్నాడు. చిరంజీవి పార్టీలోపలకు వస్తే, ఆ కొరత తీరిపోతుంది. పార్టీని నడపడం చేతకాక చతికిలపడినా, చిరంజీవికి జనంలో మోజు

కొరవ 14వ పేజీలో



**అది**

## రాహుల్ ఆలోచనా?

ప్రజారాజ్యంతో పొత్తు పెట్టుకోవాలని పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ చేసిన ప్రయత్నం వెనుక రాహుల్‌గాంధీ ప్రమేయం వుందని చెప్తున్నారు. దేశంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకొని రావడానికి రాహుల్‌గాంధీ దీక్ష పట్టి వున్నది తెలిసిన సంగతే. నామరూపాలు లేకుండాపోయిన ఉత్తరప్రదేశ్‌లో ఈసారి కాంగ్రెస్‌కు 20 ఎమ్పీ స్థానాలు దక్కాయంటే, అది రాహుల్ తపస్సు ఫలితమే అని చెప్పవచ్చు. నలభై ఏళ్ల క్రితమే అదృశ్యమైపోయిన తమిళనాడులో కూడా కాంగ్రెస్‌కు ప్రాణప్రతిష్ట చేయడానికి ఆ యువకుడు శ్రమిస్తున్నాడు. బీహార్, పశ్చిమ బెంగాల్‌ల మీద సైతం దృష్టిపెట్టి వున్నాడు. 2014 ఎన్నికల నాటికి పార్లమెంట్‌లో కాంగ్రెస్ తనంతట తానుగా మెజార్టీ సాధించే పరిస్థితి సృష్టించాలన్నది రాహుల్‌గాంధీ తపన. అందుకోసమే ఆ తపస్సు.

కొరవ 14వ పేజీలో

## కార్టూన్ స్కేప్



ప్రజారాజ్యం పిల్లను మీరు ఓకె చేస్తే తాళి కట్టేస్తారట మేడం...

## డిఎస్ కక్ష సాధింపు

పిసిసి అధ్యక్షుడు డి.శ్రీనివాస్ తమ మీద కక్ష సాధింపు సాధిస్తున్నాడని వైఎస్ అనుచరవర్గం ఆరోపిస్తున్నది. తెలంగాణా జిల్లాలలో అయితే ఆయన తమను వెంటాడి వేటాడుతున్నాడని గొడవ చేస్తున్నారు వారు. ఆదిలాబాద్ జిల్లా సిర్పూర్‌కాగజ్ నగర్ ఎమ్మెల్యే కోనప్ప, వైఎస్ అనుచరులలో అతి ముఖ్యుడు. వైఎస్ మరణించి రెండు నెలలైన సందర్భంగా ఆయన తమ వూర్లో ఒక సభ పెట్టి, నివాళులు అర్పించాడు. అయితే ఈ సభ కోసం ఏర్పాటు చేసిన వేదిక మీద సోనియాగాంధీ బొమ్మ పెట్టనందుకు పిసిసి ఆయన్ను సంజాయిషీ కోరింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాంను ఏకంగా ఆరేళ్లపాటు పార్టీ నుంచి బహిష్కరిస్తూ నిర్ణయం తీసుకొన్నాడు డిఎస్. అది ఆయన స్వంత జిల్లా కావడం గమనార్హం. ఆ జిల్లాలో జరిగిన ఒకటి రెండు సమావేశాలలో గంగారాం తనను పని గట్టుకొని విమర్శించాడన్న కోపంతో, కనీసం షోకాజ్ నోటీసు కూడా ఇవ్వకుండా ఏకంగా పార్టీ నుంచి బహిష్కరించాడు.

పిసిసి అధ్యక్షుడు ఇట్లా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొంటుంటే తాము ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు వీరు.

## కెవిపి మౌనరాగం

2003లో జరిగిన వైఎస్ పాదయాత్ర నాటి నుంచి రాష్ట్ర రాజకీయాలలో కీలకపాత్ర పోషిస్తున్న కెవిపి రామచంద్రరావు, ఈ మధ్య కొంతకాలంగా అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నాడు. వైఎస్ బ్రతికి వున్నంతకాలం, అధికారం వున్నా లేకపోయినా, ప్రతిరోజు పొద్దున సాయంత్రం వైఎస్ ఇంటికి రావడం ఆయనకు అలవాటు. వైఎస్ మరణించిన తర్వాత కూడా ఒకటిన్నర నెలపాటు ఆ అలవాటునే కొనసాగించాడు. వైఎస్ అనుచరులు, అభిమానులందరినీ తానే సముదాయించాడు. కానీ రెండు వారాల నుంచి ఆయన వైఎస్ ఇంటికి పెద్దగా రావడం లేదు. వచ్చినా మొక్కుబడిగా కొద్దిసేపు కాలక్షేపం చేసి వెళ్లిపోతున్నాడు. అందుకు కారణం, జగన్‌కు ఆయనకు మధ్య దూరం పెరగడమే అని గుసగుసలు విన్పిస్తున్నాయి. తనను ముఖ్యమంత్రిని చేయడానికి కెవిపి పాటించిన వ్యూహం బెడిసి కొట్టడం పట్ల అసంతృప్తితో వున్న జగన్, తాను స్వంతపార్టీ పెడతానంటే అడ్డంచెప్తున్నాడని ఆగ్రహిస్తున్నాడట. కెవిపి తప్పుడుపోకడల వల్లే జగన్‌కు పదవి చేజారిందని వైఎస్ కుటుంబీకులందరూ నిందిస్తున్నారు. వైఎస్ పట్ల, ఆయన కుటుంబం పట్ల తన చిత్తశుద్ధిని శంకించే పరిస్థి

కొరవ 14వ పేజీలో

# మధుకోడాలెందరో...!

జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత పార్లమెంటు సభ్యుడు మధుకోడా అక్రమార్జన మొత్తాలు వింటుంటే కళ్లు తిరిగిపోతున్నాయి. గుండెలు చెదిరిపోతున్నాయి. ఆయన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్నది రెండంటే రెండేళ్లు మాత్రమే. అంతకుక్రితం మరొక రెండేళ్లు గనులు, ఖనిజాల మంత్రిగా పనిచేశాడు. ఈ నాలుగేళ్ల వ్యవధిలో మధుకోడా అక్రమార్జన నాలుగువేల కోట్ల రూపాయలు దాటిందని రుజువులతో సహా దొరికిపోయింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనను అరెస్టు చేయడానికి వస్తున్నారని తెలియగానే, నేర స్వభావం కల్గిన అందరు రాజకీయవాదుల వలెనే ఆయనకు కూడా గుండెపోటు వచ్చింది. అరెస్టు, జైలు తప్పించుకొని హాయిగా కార్పొరేట్ ఆస్పత్రిలో, ఫైవ్‌స్టార్ వసతులతో సేద దీరుతున్నాడు.

జార్ఖండ్ ప్రకృతి సహజవనరులకు పుట్టినిల్లు. అక్కడ దొరకని ఖనిజం లేదు. ఐరన్‌ఓర్, బాక్సైట్, బొగ్గు, బంగారం వంటి ఖనిజాల గనులు లక్షలాది విస్తీర్ణంలో విస్తరించి వున్నాయి. వాటి కోసం దేశ, విదేశాల నుంచి బడాబడా పారిశ్రామిక సంస్థలు పోటీలుపడి ముందుకు వస్తున్నాయి. వారికి గనుల కేటాయింపు ఆ రాష్ట్రంలోని రాజకీయవాదులకు బంగారు పంటతో సమానం. వందెకరాల ఇనుప ఖనిజం గని అప్పచెప్తే వందల కోట్ల రూపాయల లంచం ముట్ట చెప్పడానికి సిద్ధపడే పారిశ్రామిక సంస్థలున్నాయి. రాజకీయవాదులు, అధికారులు, వ్యాపారులు కలిసి ఈ దేశ సంపదను నిట్టనిలువునా దోపిడీ చేస్తున్నారు.

భారతదేశంలో మధుకోడా పెట్టుబడి పెట్టని నగరం అంటూ ఏదీ లేదు. దాదాపు 70 ప్రదేశాలలో అతడి అక్రమార్జన కోసం వెతుకులాడింది ఇన్‌కంటాక్స్ విభాగం. అదికాక, థాయిలాండ్, మలేషియా, సింగపూర్ దేశాలలో హోటళ్లు కొన్నాడు. లైబేరియాలో బొగ్గు గనులు కొన్నాడు. ఒక్క దుబాయి దేశానికే, హవాలా మార్గం ద్వారా 550 కోట్ల రూపాయలు తరలించాడట ఆ ఘనుడు. స్విట్జర్లాండ్ బ్యాంకులో మరొక వెయ్యి కోట్ల రూపాయల వరకు దాచాడట. ఇంతా చూస్తే మధుకోడా వయస్సు కేవలం 38 ఏళ్లు మాత్రమే. అతడి రాజకీయ జీవితం 2001లో మాత్రమే ఆరంభమైంది. ఆనాటికి అతడొక సామాన్యవ్యక్తి. ఈ వేల కోట్ల దోపిడీలో అతడితో కలిసి పనిచేసిన సిన్హా, చౌదరి అనే ఇద్దరు సహచరుల గత జీవితం చూస్తే ఇంకా ఆశ్చర్యం కల్గుతుంది. సిన్హా, నాలుగేళ్ల క్రితం వరకు సైకిల్ మీద ఇంటింటికి తిరిగి పాలు పోసి, బ్రతికేవాడట. చౌదరి, మాణిక్‌చంద్ వంటి గుట్కాలు అమ్ముకొనేవాడట. కానీ వీరిద్దరి పేరుతో ఈరోజు దుబాయిలో భవనాలున్నాయి. థాయిలాండ్‌లో హోటళ్లు వున్నాయి.

జార్ఖండ్ వంటి చిన్న రాష్ట్రానికి కేవలం రెండేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన రాజకీయవాది ఇంతగా దేశాన్ని దోచుకొని తిన్నాడంటే, ఇక ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ వంటి పెద్ద రాష్ట్రాలు, భారీ బడ్జెట్లున్న రాష్ట్రాలను ఏళ్లతరబడి పరిపాలిస్తున్న నేతలు ఇంకెంత దారుణమైన బందిపోట్ల వలె వ్యవహరించి వుంటారో వూహించుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వం ఒక స్థిరమైన రాజకీయ నిర్ణయం తీసుకొని, అవినీతి ఆరోపణలు వచ్చిన ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులందరి మీదా ఇదే తీరులో దాడులు జరిపితే, వారి ఇళ్లు, కార్యాలయాలు సోదా చేస్తే, ఎన్ని లక్షల కోట్ల రూపాయల అక్రమార్జన వెలికి వస్తుందో వూహించలేము.

ప్రజాధనాన్ని అప్పనంగా, పటిక బెల్లం చందంగా ఆరగించే దేశ ద్రోహులు మన రాజకీయవ్యవస్థ మొత్తం వ్యాపించిపోయి వున్నారు. ప్రధానమంత్రి స్థాయి నుంచి పంచాయితీ సర్పంచ్ వరకు కొన్ని వేలు, లక్షల మంది మధుకోడాలు గాదె క్రింద పందికొక్కుల వలె బొక్కుతున్నారు. దేశాన్ని చీడ పురుగుల వలె పీల్చి పిప్పి చేస్తున్నారు. ఏ సైనిక ప్రభుత్వమో అధికారంలోకి వచ్చి, చట్టాలు, కోర్టులు పక్కనపెట్టి, రాజకీయవాది అన్న ప్రతివాడినీ సోదా చేసి, వారి అక్రమ ఆస్తులను ప్రజాపరం చేస్తే తప్ప ఈ దోపిడీ ఆగదు. అప్పుడప్పుడు ఖర్మచాలక దొరికిపోయే మధుకోడాల గురించి మాత్రమే మనం వింటూ వుంటాము.

## జనవాణి

### నష్టపరిహారం చెల్లించండి!

నెల్లూరు బొల్లినేని ఆసుపత్రిలో చేసిన కంటి ఆపరేషన్లు వికటించి 16 మంది కంటిచూపు కోల్పోయారు. మరో 20 మంది పరిస్థితి ఏమౌతుందో ఇప్పుడే చెప్పలేని స్థితి. నాసిరకం మందులు వాడి నిరుపేదల కంటి చూపు పోగొట్టడం దారుణం. కార్పొరేట్ ఆసుపత్రుల ధనదాహానికి అంతు లేకుండా పోతుంది. ఆరోగ్యశ్రీ పథకాన్ని అడ్డుపెట్టుకొని దోచుకొంటున్నారు. రాజకీయపార్టీల నేతలు బొల్లినేని ఆసుపత్రికి అండగా నిలవకుండా బాధితులకు బాసటగా నిలిచి నష్టపరిహారం ఇప్పించ మనవి.

మహ్మద్ షహబుద్దీన్, నెల్లూరు, వాస్తు రామచంద్ర, నెల్లూరు

### డాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

బొల్లినేని కంటి వైద్యశాల నేతృత్వంలో జరిగిన ఉచిత శస్త్రచికిత్స శిబిరంలో ఆపరేషన్లు చేయించుకొన్న 36 మంది అంధులయ్యే ప్రమాదం పొంచి వుంది. కంటిలో శుక్లాన్ని తొలగించలేని వారు కూడా డాక్టర్లుగా పరిగణింపబడడం విచారకరం. 1955 ప్రాంతంలో డాక్టర్ మోడిగారు ఎటువంటి సౌకర్యాలులేని రోజుల్లోనే వీఆర్ కాలేజిలో వందలాది మందికి కంటి శస్త్రచికిత్సలు విజయవంతంగా చేశారు. నేటి డాక్టర్లు ఫోజులు మాని వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి. కంటి శస్త్రచికిత్సలు సరిగ్గా చేయలేని బొల్లినేని డాక్టర్లపై చర్యలు తీసుకోవడంతోపాటు ఈ ఆపరేషన్లలో కళ్లను కోల్పోయిన వారికి తిరిగి కళ్లను అమర్చే ఏర్పాటు చేయమనవి.

ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.

### అవినీతిని అంతమొందించండి

నేటి సమాజాన్ని పట్టిపీడిస్తున్న రుగ్మతలలో అవినీతి జాడ్యం అతి ముఖ్యమైనది. ప్రతి ప్రభుత్వ శాఖలోనూ అవినీతి మామూలై పోయింది. అవినీతిని అంతమొందించడానికి పాలకులు చిన్న ప్రయత్నం కూడా చేయడం లేదు. వారు కూడా పీకల్లోతు అవినీతిలో కూరుకపోయి వున్నారు. ప్రధాని మన్మోహన్‌సింగ్ ఈ మధ్య వ్యవస్థలో వేళ్లూనుకొన్న అవినీతిపై బహిరంగంగా మాట్లాడారు. కానీ సంకీర్ణ ప్రభుత్వాలు నడుస్తున్న ఈ రోజుల్లో ఆయన సైతం కొన్నిసార్లు మౌన యోగిలా వుండక తప్పడం లేదు. క్యాన్సర్

కొరవ 14వ పేజీలో

## 70 ఏళ్ల క్రితం ఈవారం

10-11-1939
పేజీలు : 16 వెల: అణా

### ఆత్మ గౌరవానికి ప్రతిఘటన

నెల్లూరు జిల్లా బోర్డు అధ్యక్ష పదవిని ఈనెల 1తేదీన జిల్లా కలెక్టరుగారు స్వీకరించిన వెంటనే బోర్డు భవనం మీద ఎగురుచుండిన జాతీయపతాకాన్ని తీసివేయించినారు. ఈ జెండాను పునః ప్రతిష్ఠించువరకు బోర్డులోని కాంగ్రెసు సభ్యులు 49మంది ఎవ్వరును బోర్డు సమావేశాలకు పోరాదని జిల్లా కాంగ్రెస్ వారు తీర్మానించి ఆత్మగౌరవము స్థాపించుకొన ప్రయత్నించినందులకు అభినందనలు.

***

ప్రెసిడెంటు ఎవరా అను విషయాన్వేషణ ముందు జిల్లా బోర్డు భవనంపై ఒక కాంగ్రెసు మంత్రిచే ప్రతిష్ఠింపబడి నిరాఘాటంగా ఎగురుచుండిన జాతీయపతాకాన్ని తాత్కాలిక బోర్డు ప్రెసిడెంటుగారగు జిల్లా కలెక్టరు చార్జి తీసుకున్న గంటలోనే వూడబెరికించినందుకు వారి చర్యను నిరసిస్తూ సదరు జెండా తిరుగా ప్రతిష్ఠించువరకు కాంగ్రెసు జిల్లా బోర్డు సభ్యులు 49 మందిన్నీ ఆ భవనంలోనే సమావేశం కాకూడదని 5వ తేదీన జిల్లా కాంగ్రెస్ జనరల్‌బాడీవారు తీర్మానించారు.

రాష్ట్ర కాంగ్రెస్ వర్కింగ్ కమిటీవారు 13తేది నెల్లూరు వచ్చి జిల్లాబోర్డు సభ్యులు 49 మందిని విచారించి ప్రెసిడెంటు, వైస్‌ప్రెసిడెంటు సెలక్షన్‌లు జేస్తారు. మామూలుగా మెజార్టీని బట్టి చేస్తారు. అందుకు భిన్నంగా మెజార్టీ లేకపోయినా చేస్తారని మా రాఘవయ్య ఎందుకు పిచ్చిపిచ్చి కలలు కంటున్నాడో మాకర్థం కావడం లేదు.

### నెల్లూరు గవర్నమెంటు ప్లీడరు నియామకం

నెల్లూరు గవర్నమెంటు ప్లీడరు నియామక విషయంలోనైనా మెరిట్‌ను బట్టి తూములూరు శివరామయ్య పంతులు వారిని నియమించినందులకు మద్రాసు ప్రభుత్వం వారికి నా అభినందనలు.

## 50 ఏళ్ల క్రితం ఈవారం

6-11-1959
పేజీలు: 12 వెల: 0-3-0

### పరిషత్తు అధ్యక్షులెవరు?

### లక్ష్మీ నరసారెడ్డిగారి ప్రస్తావన

పరిషత్తు అధ్యక్షతకు పార్లమెంటు సభ్యులు రేబాల లక్ష్మీనరసారెడ్డి గారి ప్రస్తావన గూడా వచ్చినట్లుంది. కాంగ్రెస్‌లోనే ఒక వర్గం వీరి పేరును సూచించారని తెలుస్తున్నది. పర్యవసానం మాత్రం తెలియలేదు. సుబ్బారెడ్డిగారు విదేశ ప్రయాణానికి బయలుదేరే ముందు వీరిని కలసుకొన్నప్పుడు పరిషత్తు ప్రస్తావనే రాలేదని అంటున్నారు. దీనిని బట్టి సుబ్బారెడ్డి గారి ఆలోచనలో లక్ష్మీనరసారెడ్డిగారి అభ్యర్థిత్వం లేనట్లే భావించవలసి వుంటుంది.

### అయితే ఎవరు?

పరిషత్తు అధ్యక్షుడుగా వుండే వ్యక్తి చురుకుగా జిల్లా అంతా సంచరించి, బలాన్ని సమీకరించే వాడుగా వుండాలని సుబ్బారెడ్డిగారి అభిప్రాయం. వారి దృష్టిలో వుండే ఆ "డైనమిక్ పర్సనాలిటీ" ఎవరో తెలియదు. ఒక నమ్మకమైన వర్గం ద్వారా వినిపిసున్న దానినిబట్టి, పరిషత్తు అధ్యక్షత ఆనం సంజీవరెడ్డి, దువ్వూరు బలరామరెడ్డి, నల్లపరెడ్డి చంద్రశేఖరరెడ్డి గారల మధ్యే వుంటుందని, వీరిలో ఎవరా అనేది వారే తేల్చుకొని నిర్ణయించుకోవలసి వుంటుందని అంటున్నారు. వీరు ముగ్గురు కానప్పుడు ఎసి పేరు పరిషత్తు అధ్యక్షతకు సూచింపబడడం సంభవమని గూడా ఈ వర్గం నుండే తెలుస్తున్నది. దీనికి ఎంత వరకు ఆధారమున్నదో మేము చెప్పలేము.

### ప్రధాని నెహ్రూతో రాఘవయ్యగారి భేటీ

వెన్నెలకంటి రాఘవయ్యగారు 1తేది ఢిల్లీలో ప్రధాని నెహ్రూను కలుసుకొని, 20 నిమిషములసేపు దేశ పరిస్థితులను, కాంగ్రెస్ రాజకీయాలను గూర్చి వివరించారట. ప్రధాని సావధానంగా విని తాను ఈ లోపాలను గమనించానని చెప్పారట. నెహ్రూ పట్ల రాఘవయ్యగారికున్న వ్యతిరేకభావం పోవడం ఈ ఇంటర్వ్యూ సత్ఫలితం.

# నెల్లూరు ముచ్చట్లు

### విహంగ వీక్షణం

## వర్షం

జిల్లాలో చిత్తకార్తెలో చినుకురాలక పోయినా స్వాతికార్తె పెట్టాక అక్టోబర్ 28,29 తేదీల్లోనూ నవంబర్ 3, 4తేదీల్లో కొద్దిపాటి జల్లులు కురిసాయి. సోమశిల ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేయడానికి తోడుగా చిరుజల్లులు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

## ప్లేట్‌లెట్‌ల కొరత

నెల్లూరులో డెంగీ జ్వరం కేసులు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తుంది. ఇది చాలాదన్నట్లు డెంగీ జ్వర పీడితులకు రక్తం గడ్డకట్టించేందుకు వినియోగించే ప్లేట్‌లెట్స్ కొరత ఇంకాస్త క్షోభ పెడుతుంది. జ్వరపీడితులకు అవసరమైన ప్లేట్‌లెట్‌లను నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సరఫరా చేయలేకపోతుంది. వీటిని తయారుచేసే పరికరాలు పెద్దాసుపత్రిలో వున్నా సిబ్బంది లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితులలో డెంగీ బాధితులను చెన్నైకు తరలించాల్సివస్తున్నది. ప్లేట్‌లెట్‌ల కొరతపై దృష్టి సారించే నాయకులు, అధికారులు నెల్లూరులో లేకపోవడం డెంగీ జ్వరపీడితులను మరింత కృంగదీస్తున్నది.

## తరచూ రోడ్ల ధ్వంసం!

రాజు తలచుకొంటే దెబ్బలకు కొదవా అన్నట్లు బాగున్న రోడ్లను సైతం రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి చిత్రమైన సాకులు చెప్పి ధ్వంసం చేయిస్తున్నారు. నెల్లూరులో కెవిఆర్ పెట్రోల్ బంకు నుంచి మద్రాసు బస్టాండ్ వరకు రోడ్లను వెంకయ్యనాయుడు కేంద్రమంత్రిగా వున్నప్పుడు విస్తరించారు. ప్రస్తుతం ఈ రోడ్డు దెబ్బతినకపోయినా సెంట్రల్ లైటింగ్‌లో మార్పుచేర్పులు చేయాలంటూ ధ్వంసం చేస్తున్నారు. అస్మదీయులకు పనులు అప్పగించను రోడ్ల ధ్వంస రచనకు ఎమ్మెల్యే పూనుకొంటే అధికారులు తలూపడం బాధాకరం.

బంగారం స్పెషల్ ఆఫర్
BIS 916 హాల్‌మార్క్
బంగారు ఆభరణములపై
సవరకు రూ.400/- తగ్గింపు.
గ్రాముకు రూ.50/- తగ్గింపు.
డైమండ్స్ పై 10% తగ్గింపు.
గోల్డ్ ప్యాలెస్
హోటల్ శివం ఎదురుగా,
జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్,
ఆచారివీధి, నెల్లూరు.
ఫోన్: 2331133, 2327611

## సోమిరెడ్డికి హైదరాబాద్ ఎన్నికల బాధ్యతలు

ఎన్నికల మంత్రాంగం నడపడంలో మంచి అనుభవమున్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల బాధ్యతలను ఆ పార్టీ సర్వాధినేత చంద్రబాబునాయుడు అప్పచెప్పారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా పనిచేయను సోమిరెడ్డి బయలుదేరివెళ్లారు. ఈ నెల రోజులపాటు ఆయన హైదరాబాద్‌లోనే వుంటారు.

## నాగేశ్వరరావుకు పోలీసు మహోన్నత సేవాపతకం

ఇందుకూరుపేట ఎస్‌ఐ ఆర్.నాగేశ్వరరావుకు ఆంధ్రప్రదేశ్ పోలీసు మహోన్నత సేవాపతకం లభించింది. దీన్ని నవంబరు 1తేదీ హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాగేశ్వరరావుకు అందించారు. నాగేశ్వరరావు జిల్లాలోని పలు స్టేషన్లలో ఎస్‌ఐగా పని చేశారు. గుంటూరు రేంజ్ క్రైం ఐడిపార్టీ ఇన్‌ఛార్జ్‌గా రాష్ట్రంలో పేరెన్నికగన్న దొంగలముఠాలను అరెస్ట్ చేసి కోట్లాదిరూపాయలు రికవరీ చేశారు. గత ఏడాది సంచలనం సృష్టించిన చాకలికొండ ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ దోపిడీ దొంగలను సైతం నాగేశ్వరరావు చాకచక్యంగా పట్టుకొన్నారు. ఖాకీ దుస్తులలో ఎంత క్రౌర్యంగా విధి నిర్వహణ చేస్తాడో వ్యక్తిగత జీవితంలో నాగేశ్వరరావు అంత సౌమ్యుడు, ఆదర్శప్రాయుడు. మహోన్నత సేవాపతకంతో నెల్లూరు పోలీసు ప్రతిష్ట పెంచిన నాగేశ్వరరావుకు మా అభినందనలు.

## మారని ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ!

నెల్లూరు ఫోర్త్‌టౌన్ ఎస్‌ఐ వేమారెడ్డి అధికార పార్టీ నేతల మెప్పుకోసం అతిగా డ్యూటీచేస్తూ విమర్శల పాలవుతున్నారు. మంత్రి రామనారాయణరెడ్డి కుమారుడు శుభకర్‌రెడ్డి పరీక్షల్లో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడ్డాడన్న అంశంపై 1తేదీ కస్తూరిబా కళాక్షేత్రం వద్ద నిరసన తెలియజేయను వచ్చిన టిఎన్‌ఎస్‌ఎఫ్ విద్యార్థిసంఘ నాయకులపై వేమారెడ్డి గట్టిగా చేయి చేసుకొన్నారు. మంత్రిని అడ్డుకొంటారా అంటూ విద్యార్థులు కృష్ణయాదవ్, చరణ్, షరీఫ్, అశోక్, రాయల్‌లను కెవిఆర్ పెట్రోల్‌బంకు వరకు కుమ్ముకొంటూ వచ్చారాయన.

ఇటీవల అనారోగ్యం బారిన పడినాకూడ వేమారెడ్డిలో దుందుడుకుతనం తగ్గకపోవడం బాధాకరం.

## రోశయ్య కటౌట్ దగ్ధం

జిల్లాలో తొలిసారిగా కావలి ఆర్యవైశ్యులు ఇక్కడి రాజీవ్ విగ్రహం దగ్గర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన ముఖ్యమంత్రి రోశయ్య కటౌట్‌ను అదేరోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేసే ప్రయత్నం చేశారు. ఈ కటౌట్‌పై జాతిపిత మహాత్మాగాంధీ, అమరజీవి పొట్టిశ్రీరాములు బొమ్మలుకూడా వున్నాయి. ఈ వ్యవహారమై కావలి మునిసిపల్ మాజీ ఛైర్మన్ గ్రంధి యానాదిశెట్టి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మేమెవరికీ భయపడం!

ఆనంవాళ్లకు వ్యతిరేకంగా మాట్లాడితే ఫ్లాట్‌ఫారంపై తిరిగే వాళ్లు కూడా ఎదురుతారని ఈమధ్య కొందరు తమ కుటుంబాన్ని అదే పనిగా ఆడిపోసుకొంటున్నారని రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి విమర్శించారు. 2తేది ఎసి

**చందాదారులకు మనవి**

- చందా పంపించేటప్పుడు తమ చందా నెంబరు, పూర్తి పేరు, చిరునామా తెలియపరచండి.
- 'జమీన్‌రైతు' చందాదార్లు తమ చందాను ఎం.ఓ/డి.డి రూపంలో మాత్రమే పంపగలరు. చెక్కులు స్వీకరించబడవు.
- మీ చందా నెంబరు, చందా ఏ తేదికి అయిపోతుందో, అడ్రసు రేపరు మీదనే ముద్రించి వుంటుంది. సకాలంలో చందా చెల్లించవలసినదిగా కోరు తున్నాము.

**జీవిత చందా రూ.1000/-**

**సంవత్సర చందా**
స్వదేశంలో రూ.200/-
విదేశాలకు రూ.1000/-

**జమీన్‌రైతు**
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190

సెంటర్‌లోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర నాయకత్వం మారినప్పుడల్లా మా కుటుంబం ఆధీనంలో వుండే వేణుగోపాలస్వామి దేవస్థానం, విఆర్ విద్యా సంస్థలపై ముఖ్యమంత్రులకు ఫిర్యాదులు చేసే కట్టఒకటుంది. రామనారాయణరెడ్డి కుమారుడు శుభకర్‌రెడ్డి మాల్‌ప్రాక్టీసు మీద జరిగే విచారణకు సహకరిస్తాం. మా బిడ్డలు ఎసి సుబ్బారెడ్డి, రంగమయూర్‌రెడ్డి, శుభకర్‌రెడ్డిలు విఆర్‌కాలేజిలో సంపాదించిన డిగ్రీలతో వుద్యోగాలు చేయడం లేదు. వాళ్ల డిగ్రీలు చదవాలని మా కుటుంబంలో ఎవరూ తహతహలాడడం లేదు. మాకు కాంట్రాక్టులు లేవు, ఫ్యాక్టరీలు లేవు. ఆర్బిట్రేషన్లు లేవు. మేం ఎవరికీ భయపడము, లోబడమని వివేకానందరెడ్డి తనదైన నాటకీయ ఫక్కీలో పేర్లు ప్రస్తావించకుండా సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాలప్రభాకర్‌రెడ్డి, రాజీవ్‌భవన్ నేతలను సుతిమెత్తగా విమర్శించారు.



రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో ఏపి పోలీసు మహోన్నత సేవా పతకాన్ని ఇందుకూరుపేట ఎస్‌ఐ ఆర్.నాగేశ్వరరావుకు అందిస్తున్న ముఖ్యమంత్రి రోశయ్య.

## ఫలించని శాంభవి జోస్యం

బౌద్ధమత గురువు దలైలామాతో గతానుజన్మ బంధముందంటూ వార్తలకెక్కిన చిన్నారి శాంభవి నెల్లూరు నుంచి కడప జిల్లాకు మకాం మార్చింది. 1తేది కడప దగ్గర గల ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ నిల్వచేసే ట్యాంకులు పేలిపోయి పెద్ద నష్టం జరుగుతుందని భవిష్యవాణి పలికింది. కాని అటువంటిదేది జరగకపోవడంతో జనానికి శాంభవిపై పెంచుకొన్న భ్రమలు వీడుతున్నాయి.

## చికున్ గున్యా విజృంభణ

నెల్లూరు నగరంలో చికున్‌గున్యా జ్వరాలతో జనం తల్లడిల్లిపోతున్నారు. చిన్నా పెద్దా తేడా లేకుండా వందలాదిమంది గున్యా బాధితులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. నగరంలో పారిశుధ్య పరిస్థితులు క్షీణించి దోమలు విజృంభించడంతో గున్యా విజృంభించింది. కార్పొరేషన్ పాలకులు చేతులు కాలాక ఆకులుపట్టుకొన్న చందాన ఇప్పుడు తూతూమంత్రంగా దోమల నిర్మూలన చర్యలకు ఉపక్రమించారు.

## ముదిగొండ శ్రీనివాసులకు పదవి

నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షునిగా ముదిగొండ శ్రీనివాసులుగా నియుక్తులయ్యారు. ముదిగొండ శ్రీనివాసులు స్వగ్రామం ఇస్కపల్లి. ఆర్యవైశ్య సంఘంలో లేనప్పుడు కూడా ఆయన ఆర్యవైశ్య సమస్యలపై జిల్లావ్యాప్తంగా పర్యటించేవారు. మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి శ్రీనివాసులు వీరాభిమాని. కాంగ్రెస్‌పార్టీలో పదవులు పొందకపోయినా ఆర్యవైశ్యసంఘం శ్రీనివాసులు సేవలను గుర్తించి పదవినిచ్చింది.

## వాస్తుమార్పులతో పార్టీ బాగుపడదు!

వాస్తులో మార్పు చేర్పులతో పార్టీ పరిస్థితి బాగుపడదని బిజెపి జాతీయ నాయకుడు ఎం.వెంకయ్యనాయుడు చమత్కరించారు. నెల్లూరు మినీబైపాస్ రోడ్డులో వాస్తుమార్పులతో ముస్తాబు చేసిన పార్టీ జిల్లా కార్యాలయాన్ని 1తేది తిరిగి ప్రారంభించి ఈవ్యాఖ్యలు చేశారు. వెన్నునొప్పి కారణంగా పక్షంరోజులు రాజకీయాలకు దూరమైనా మళ్లీ వాటిని స్వంత జిల్లాలో నుంచే ఆరంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## బంగారు గరుడ వాహనంపై రంగడు

నెల్లూరీయుల ఆరాధ్యదైవం రంగనాయకులస్వామి బంగారు గరుడ వాహనంపై 31తేదీ నగరంలో ఊరేగారు. చిలుకద్వాదశిని పురస్కరించుకొని ఈ నగరోత్సవం జరిగింది.

## ఆలయంలో అపశృతులు

కార్తీకమాసంలో శివాలయంలో ఆకాశ దీపాలు వెలిగించడం పరిపాటి. కార్తీక సోమ వారంనాడు నెల్లూరు మూలాపేట మూలస్థానేశ్వరాలయంలో అపశృతి దొర్లింది. భక్తులు కట్టిన ఆకాశదీపం ఉన్నట్లుండి తెగిపోవడంతో క్రింద కార్తీకదీపాలు వెలిగిస్తున్న వారిపై పడి మంటలు చెలరేగాయి. అక్కడే వున్న చిన్నారి శరీరం కాలడంతో హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. మరో మహిళ చీరకు నిప్పంటుకొంది. ఓ ఆవు ఆలయానికి వచ్చి రంకెలు వేసింది. ఎప్పుడూ ఇలాంటి ఘటనలు జరగక

కొరవ 14వ పేజీలో

అమ్మ ఫర్నిచర్స్
"A House of Life style furnitures"
గృహాలంకరణకు కావలసిన అత్యాధునిక ఇంపోర్టెడ్ ఫర్నిచర్,
రాఘవ హోటల్ కాంప్లెక్స్ రోడ్, నెల్లూరు. సెల్: 9246435666, 9849493666

• బెదిరించిన వివేకా

# సెలవులో బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్

నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి జోక్యం మితిమీరి పోయింది. కమిషనర్ దగ్గర నుంచి అటెండర్ వరకు ఆయన చెప్పిందే వేదం. ప్రజాసంబంధ వ్యవహారాలను మునిసిపల్ ఉద్యోగులతో చర్చించడం లేదాయన. తాను చెప్పిన కాంట్రాక్టర్లకు బిల్లులివ్వమని, తనకిష్టం లేని వారి బిల్డింగులు పడగొట్టమని, తమకిష్టమైనవారు కొత్త బిల్డింగులు కట్టుకొనేందుకు అనుమతులు మంజూరు చేయమని గట్టి వత్తిడి చేస్తారాయన. అది మామూలుస్థాయిలో వుండదు. సిటి ప్లానింగ్ విభాగంలో ఆనం సోదరుల సహకారంతో సౌత్ రాజుపాళెంకు చెందిన క్రిష్ణయ్య బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌గా నియమితులయ్యారు. బ్రదర్స్ అండదండలుండడంతో ఈ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ బాగానే సంపాదించాడు. ఈ మధ్య వివేకానందరెడ్డికి అత్యంత స్నేహితునిగా మసిలేవ్యక్తి కడుతున్న బిల్డింగ్ వద్దకు వెళ్లి మామూలు కోసం ప్లాను అప్రూవల్ వుందా అంటూ కాస్త గట్టిగా దబాయించాడట. ఆయన రూరల్ ఎమ్మెల్యేకు ఈ విషయం ఫోన్‌చేసి చెప్పడంతో ఆఘమేఘాల మీద బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌ను ఇంటికి పిలిపించి రాయలేని భాషలో మందలించడంతోపాటు ఇక్కడ ఎలా డ్యూటీ చేస్తావో చూస్తాననడంతో వేరే ప్రాంతానికి బదలీ చేయించుకోను 15 రోజులుగా మెడికల్ లీవు పెట్టి తిరుగుతున్నట్లు తెలిసింది. ఈ బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌ను ఎసిబికి పట్టించేలా ప్లాన్ రూపొందించినా విఫలమైనట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే చెప్పిన పనులన్నీ చేసి ఒక్క పని చేయని ఉద్యోగుల పరిస్థితికి నిదర్శనంగా క్రిష్ణయ్య ఉదంతాన్ని చెప్పుకోవాలి.

లంచాల మత్తులో అధికారులు

# జోరుగా రీసైక్లింగ్ కవర్ల తయారీ

నెల్లూరు నగరంలో రీసైక్లింగ్ చేసిన ప్లాస్టిక్ రంగుకవర్లను విరివిగా వినియోగిస్తున్నారు. వీటిపై ప్రభుత్వం నిషేధం విధించినా దాన్ని అమలు పరిచేవారు లేకుండా పోయారు. ఈ కవర్లు తేలిగ్గా వుండడంతోపాటు చౌకగా లభిస్తుండడంతో కూరగాయలు, పండ్లు, చేపలు, మాంసం, మందులు, భోజనం, టిఫిన్లు అన్నీ వీటిలోనే తీసుకవెళ్తున్నారు. 20 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల కవర్లను వినియోగిస్తే క్యాన్సర్, అల్సర్‌తోపాటు పలు రోగాలు కొనితెచ్చుకొన్నట్లేనని పరిశోధకులు వెల్లడించినా పట్టించుకొనే వారు లేరు. రీసైక్లింగ్‌కు వినియోగిస్తున్న కవర్లు దుస్థితిలో వుండేవి. వీటిలో ఎక్కువ రంగు వినియోగించి మళ్లీ కవర్లుగా తయారుచేస్తుండడం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ రీసైక్లింగ్ కవర్లు అంత సులభంగా మట్టిలో కలవవు. ఇప్పటికే నగరంలో పారుదల కాల్వలన్నీ ప్లాస్టిక్ కవర్లతో పేరుకపోయి ఎక్కడి మురికి అక్కడ నిలచిపోతుంది. దీనివల్ల నగరంలో దోమలు విజృంభిస్తున్నాయి. నీళ్లు కలుషితమవుతున్నాయి. ఈ నీటిని తాగి నగర ప్రజలు క్రొత్త క్రొత్త రోగాలు తెచ్చుకొంటున్నారు. నగరంలో 10కి పైగా కవర్ల రీసైక్లింగ్ యూనిట్లు నడుస్తున్నాయి. రోజుకు రెండు లక్షల నుంచి నాలుగు లక్షల రూపాయలకు పైగా ఈ కవర్ల వ్యాపారం నడుస్తుంది. నెలకు పది లక్షల రూపాయలను ఇటు పర్యావరణ పరిరక్షణ శాఖాధికారులు, కార్పొరేషన్ ఆరోగ్య శాఖాధికారులు లంచం తీసుకొని ఈ వ్యాపారాన్ని ప్రోత్సహించడం తగనుగాక తగదు.

# వైద్య ఆరోగ్య శాఖ కుంభకర్ణ నిద్ర



జిల్లాలో స్వైన్‌ఫ్లూ, డెంగీ, వైరల్ జ్వరాలతోపాటు కామెర్లు విజృంభించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిలో చలనం లేదు. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యసేవలు అందించాల్సిన వైద్యులు, ఎఎన్ఎంలు ఇతర సిబ్బంది గ్రామాలను సందర్శించడం లేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సరఫరా కావాల్సిన మందులు కూడా మధ్యలో మాయమైపోతున్నా అడిగేవారు లేకుండా పోయారు. ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో స్వైన్‌ఫ్లూ, డెంగీ జ్వరాల కేసులు లెక్కలేనన్ని నమోదవుతున్నాయి. మరణాలు సంభవిస్తున్నా ఈ శాఖలో ఉలుకు పలుకు లేదు. వైద్య ఆరోగ్య శాఖాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పర్యవేక్షించడంలో పూర్తిగా విఫలం చెందడం వల్ల విధులు నిర్వహించాల్సిన డాక్టర్లు, ఇతర సిబ్బంది సొంతపనుల్లో బిజీగా వుంటున్నారు. వర్షాలు పడకముందే జిల్లాలో వైరల్ జ్వరాలు, అతిసార కేసులు వందల సంఖ్యలో నమోదవుతున్నాయి. పొదలకూరులో డెంగీతో, కావలిలో స్వైన్‌ఫ్లూతో ఇద్దరు వ్యక్తులు మరణించారు. వైద్యఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ ఇటీవల జిల్లాలోని కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడ డాక్టర్లు, సిబ్బంది లేకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అక్టోబర్ 31వ తేది పదవీ విరమణ చేశారు. కొత్తగా వచ్చే డిఎం అండ్ హెచ్‌ఓనైనా కాస్త చురుకుగా పనిచేయకుంటే జిల్లాలోనూ ఏజన్సీ ప్రాంతాల మాదిరి వ్యాధి పీడితులు ఎక్కువైపోతారు.



నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన రాష్ట్రఅవతరణ దినోత్సవ వేడుకలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, ఎస్పీ మల్లారెడ్డి, ఇన్‌ఛార్జ్ కలెక్టర్ సౌరభ్‌గౌర్, ఎఎస్పీ కనకారావు.

• వెంకయ్య ఆశాభావం

# భవిష్యత్తు బిజెపిదే!



కేంద్రంలో అధికారంలో వున్న యుపిఏ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతుందని 2014 ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జాతీయ నాయకుడు ఎం.వెంకయ్యనాయుడు జోస్యం చెప్పారు. 1వ తేది సరికొత్త హంగులు దిద్ది ముస్తాబుచేసిన నెల్లూరుజిల్లా బిజెపి కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పార్టీ శ్రేణులు డీలా పడకూడదని ధైర్యం చెప్పారు. ప్రతి కార్యకర్త అంకిత భావంతో పనిచేస్తే పార్టీ బలపడుతుందన్నారు. పార్టీ శ్రేణులను దృష్టిలో పెట్టుకొని నాయకులు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని వెంకయ్య జిల్లా నాయకులకు సూచించారు. అధికారంలో లేనప్పుడు చేసిన కార్యక్రమాలను ప్రజలు గుర్తిస్తారని అవసరమైనప్పుడు అండగా నిలబడతారని సలహా యిచ్చారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తే భవిష్యత్తులో మంచి ఫలితాలుంటాయని పార్టీ కార్యకర్తలకు ఆశ పెట్టారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, మహిళా నేతలు విజయలక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

# స్టేడియంలో శిక్షకులు లేరు

ఎసి సుబ్బారెడ్డి స్టేడియంలో క్రీడల కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నా శిక్షకుల కొరత క్రీడాకారులను పట్టిపీడిస్తోంది. అన్నీ



వున్నా అల్లుడినోట్లో శని అన్న చందంగా వుంది క్రీడాకారుల పరిస్థితి. లక్షల రూపాయలు వెచ్చించి క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నా వివిధ క్రీడల్లో శిక్షణనిచ్చేందుకు అవసరమైన కోచ్‌లు లేకపోవడంతో ఆసక్తి, ప్రతిభ వుండి కూడా క్రీడాకారులు ఏమీచేయలేక మిన్నకుండి పోవాల్సి వస్తోంది. స్టేడియంలో హాకీ, షటిల్, టేబుల్ టెన్నిస్, కోకో, కబడ్డీ, బాస్కెట్ బాల్, వాలీబాల్, తదితర క్రీడల్లో పలువురు క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. వీటిలో షటిల్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్‌లకు

## క్రీడాకారులకు నిరాశే

గత ఐదేళ్లుగా కోచ్ లేదు. వ్యాయామ ఉపాధ్యాయులు అరకొరగా శిక్షణనిస్తుండడంతో క్రీడాకారులు విధిలేని పరిస్థితులలో మొక్కుబడిగా క్రీడల్లో పాల్గొనాల్సి వస్తోంది. శిక్షకులు లేని కారణంగా విలువైన క్రీడాపరికరాలు నిరుపయోగంగా మారుతున్నాయి.



రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు శేగు షణ్ముఖరావు, అమరా మోహన్‌రావు, పేరూరి నరసింహులు తదితరులు.



రాష్ట్రంలో వడ్డెర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి రోశయ్యను కలసి వినతిపత్రం ఇస్తున్న ఆ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు మల్లి నిర్మల.



నెల్లూరు నగరంలోని 43, 44, 45 డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి అనిల్‌కుమార్ యాదవ్.

# వెంకన్నపాళెం ఉపాధిహామీ పనుల్లో అవినీతి!

ఉపాధిహామీ పనుల్లో జరుగుతున్న అక్రమాలు రోజురోజుకు లెక్కకు మించి వెలుగు చూస్తూనే వున్నాయి. తోటపల్లిగూడూరు మండలం వెంకన్నపాళెం ఫీల్డు అసిస్టెంటు భాగోతం బట్టబయలైంది. చేసిన పనులే తిరిగి చేయించడం, గిరిజనుల పేరుతో జాబ్‌కార్డులు సృష్టించి వారి పేరుతో పాసు పుస్తకాలు తయారు చేయించి నిశానీలుగా చూపి డబ్బులు డ్రా చేసి అధికమొత్తంలో స్వాహా చేశాడట ఈ ఘనుడు. కొన్ని వేల రూపాయలపైన అక్రమాలకు పాల్పడ్డాడట ఈ అసిస్టెంటు. ఇంకా లోతుగా విచారిస్తే మరిన్ని అక్రమాలు బయటపడతాయి. ఎరుకుల కులానికి చెందినవారు కాబట్టి వీరు ఇప్పటి వరకు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు పొందలేకపోయారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తెచ్చినా ఫలితం లేకుండా పోయింది. గ్రామ సర్పంచ్ సహకారంతో ఈ అక్రమాలకు పాల్పడ్డాడట ఫీల్డ్ అసిస్టెంట్. ఒకవైపు ఈ

## బోగస్ జాబ్‌కార్డుల ద్వారా నిధుల స్వాహా

ప్రాంత గిరిజనులు ఉపాధిహామీలో నష్టపోగా, మరోవైపు నవజీవన్ అనే సేవాసంస్థ వీరికి ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి అసంపూర్తిగా వదిలేసింది. ఇళ్ల నిర్మాణం జరగక చెట్ల క్రిందనే బతుకుతున్నారు గిరిజనులు. తోటపల్లి గూడూరు మండలానికి ఉపాధిహామీ క్రింద కోటి 34లక్షల రూపాయలు మంజూరయితే వీటిలో 70వేల మేర దుర్వినియోగం అయినట్లు సోషల్‌ఆడిట్‌లో తేలింది. మల్లికార్జునపురంలో ఉపాధిహామీ ముసుగులో కాంట్రాక్టర్ల ద్వారా సిసి రోడ్లు నిర్మించడం సోషల్ ఆడిట్ దృష్టికి వచ్చింది. కోవెరపాళెంలో ఎంసిఎ చదువుతున్న విద్యార్థి పేరుతో జాబ్‌కార్డు వుంది. ఇలాంటి చిత్రవిచిత్రాలు ఉపాధిహామీ పనుల్లో జరుగుతున్నాయంటే ఎంతగా నిధులు ప్రక్కదారి పడుతున్నది తేటతెల్లం అవుతుంది.

# సాగునీటి కోసం పాట్లు!

- కావలి కాలువ ఆయకట్టుదార్లకు ఎన్ని కష్టాలో?

పుష్కలంగా నీరున్నా సాగునీటికోసం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తింది కావలి కాలువ ఆయకట్టుదారులకు. సంగం బ్యారేజి వద్ద కావలి కాలువకు చాలినంత నీరున్నా నీటి దోపిడీ వలన రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. సంగం బ్యారేజి వద్ద కావలి కాలువకు 450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు సోమశిల అధికారులు చెబుతున్నా వీటిలో 200 క్యూసెక్కుల నీటిని అనధికార ఆయకట్టు రైతులు విద్యుత్ మోటార్లను ఉపయోగించి నారు, నాట్లు వేసుకొంటుండడంతో అసలైన ఆయకట్టు దారులకు కన్నీళ్లే మిగులుతున్నాయి. ఈ కాలువ క్రింద అధికారికంగా 75వేల ఎకరాలకు సాగునీరు అందాల్సి వున్నా 25వేల ఎకరాలకు కూడా నీరు అందక పంట ఎండిపోయే దుస్థితి ఏర్పడింది. సంగం బ్యారేజి నుంచి కావలి వరకు షుమారు 3,800 విద్యుత్ మోటార్లు అక్రమంగా పని చేస్తున్నా అధికారులు ఆవైపు చూడటం లేదు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొని పోయినా వారు పట్టించుకోకపోవడంతో నీరందక పంట పండించుకోలేక పోతున్నామని రైతులు వాపోతున్నారు.

- ఉదయగిరి ప్రాంతంలో లెక్కలేనన్ని...

# గాడి తప్పిన పంచాయితీలు!

ఉదయగిరి ప్రాంతంలో పంచాయితీలు గాడి తప్పాయి. రాజకీయాలు, వర్గపోరుతో పాలకులు ప్రజల సౌకర్యాలను పట్టించుకోకపోవడంతో నిధులు ప్రక్కదారిపడుతున్నాయి. ఎలాంటి తీర్మానాలు లేకుండానే సర్పంచ్‌లు ఇష్టానుసారంగా పనులు చేయిస్తూ నిధులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు, కనీససౌకర్యాల కల్పనకు పనులు చేపట్టినట్లు నిధులు డ్రా చేస్తున్నా ఏ గ్రామంలోనూ వాటి జాడే కన్పడడం లేదు. తాగునీటి సమస్య, దెబ్బతిన్నరోడ్లు యథావిధిగానే ప్రజలను ఇబ్బందిపెడుతున్నా పట్టించుకొనే వారే లేకుండా పోయారు. మండలంలోని 17 పంచాయితీల్లో ఇదే పరిస్థితి. బండగానివల్లె పంచాయితీలో పెద్దఎత్తున నిధులు స్వాహాజరిగినట్లు దుమారం రేగింది. అప్పసముద్రం, దాసరిపల్లి, జి.చెరువుపల్లి, కొండాయపాళెం, పుల్లాయపల్లి, తిరుమలాపురం, వెంగళరావు నగర్ పంచాయితీల్లో జరిగిన పనుల్లో నాణ్యత లేకపోయినా బిల్లులు చెల్లింపు జరిగిపోయాయి.

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190

# దీపం పథకంపై దింపుడు కళ్లెం ఆశ!

**ఆత్మకూరులో దరఖాస్తుకు మహిళలు బారులు దీరారు.**

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన దీపం పథకాన్ని రాష్ట్రప్రభుత్వం పున:ప్రారంభిస్తుందనే ప్రచారంతో ఆత్మకూరు మండలంలోని మహిళల్లో హడావిడి మొదలైంది. జిల్లాలో మూడు సంవత్సరాల నుంచి ఈ పథకం క్రింద లబ్దిదారుల ఎంపిక జరగడం లేదు. తిరిగి ఇప్పుడు ఈ ప్రచారం జరగడంతో మండలంలో పలు గ్రామాల ప్రజల్లో అలజడి రేగింది. ఈ పథకం క్రింద గ్యాస్‌కనెక్షన్లు పొందేందుకు పంచాయితీ కార్యాలయాల వద్దకు మహిళలు బారులు తీరుతున్నారు. అయితే ఎంపిక విధానంపై పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలో ఒకసారి ఆత్మకూరులో ఇలాగే దరఖాస్తులు తీసుకొన్నారు. అవి ఏమయ్యాయో అంతు చిక్కలేదు. మళ్లీ ఇప్పుడు దరఖాస్తుల సేకరణ జరుగుతుండడంతో రాజకీయ సిఫార్సులకు అనుగుణంగా గ్యాస్ కనెక్షన్లు ఈ పథకం క్రింద మంజూరు చేస్తారనే అనుమానాలను పలువురు ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. 575 కనెక్షన్లు రెండేళ్ల నుంచి పెండింగ్‌లో వున్నాయట. వాటి సంగతి ఏంటని మహిళలు ప్రశ్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో దరఖాస్తుదారులతో పంచాయితీ కార్యాలయాలు కిటకిటలాడుతున్నాయి.




కర్నూలు వరద బాధితులకు సహాయం చేస్తున్న ది నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు.



కర్నూలు వరద బాధితులకు సహాయం చేస్తున్న నెల్లూరు తెలుగుదేశం నేతలు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వెంకటస్వామినాయుడు, రమేష్‌రెడ్డి.

# కామాక్షమ్మ సన్నిధిలో నిలువు దోపిడీ

• పూజారులదే రాజ్యం

పవిత్ర పుణ్యక్షేత్రమైన జొన్నవాడ కామాక్షితాయి దేవస్థానంలో దోపిడీ ఎక్కువైంది. కొంతమంది పూజారులు డబ్బులుంటేనే దర్శన భాగ్యం కల్పిస్తున్నారు లేదంటే కామాక్షమ్మ తల్లి దర్శనం గగనమైపోతుంది. ఆలయ సిబ్బంది మొదలు పూజారుల వరకు ప్రతిఒక్కరూ విధులకు డుమ్మాకొట్టి వారి స్థానాల్లో బయటి వ్యక్తులను తీసుకొనివచ్చి పెడుతున్నారు. వీళ్ల భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రతినిత్యం అమ్మవారి సేవలకుగాను ఐదు కుటుంబాల నుంచి ఐదు మంది పూజారులు రావాల్సివుంటుంది. వీరు ఇష్టానుసారం ప్రవర్తిస్తున్నా కమిటీ పట్టించుకోవడం లేదు. ఆలయఅధికారి ఇదేమీ పట్టించుకోకుండా సొంత ఇంటి నిర్మాణంలో తలమునకలైవున్నాడు. శరన్నవరాత్రుల సమయంలో సూర్యోదయానికి ముందే ఆలయం తెరవాల్సి వున్నా ఎనిమిది గంటల వరకు తీయకపోవడం వారి నిర్లక్ష్యాన్ని తెలియజేస్తున్నది. ప్రసాదాలు ఎంతెంత తయారుచేస్తున్నారు. ఎంత అమ్ముతున్నారు అనేది లెక్కపక్కా లేదు. గతంలో ఇక్కడకు విచ్చేసిన కంచి పీఠాధిపతి శ్రీ జయేంద్ర సరస్వతి ఆలయంలో జరుగుతున్న పూజా విధానాలను తప్పుబట్టినా వారిలో మార్పు లేకపోవడం వారి ప్రవర్తనను తెలియజేస్తున్నది. భక్తులు ఇబ్బందులు పడుతున్నా స్థానిక శాసనసభ్యుడు ప్రసన్నకుమార్‌రెడ్డికి ఇవేమీ పట్టకపోవడం విచిత్రం.

## పోర్టుకు పెద్ద క్రేన్లు!

ఎగుమతి, దిగుమతులను వేగవంతం చేసేందుకు కృష్ణపట్నం పోర్టుకు నాలుగు భారీ క్రేన్లు వచ్చాయి. జర్మనీ నుంచి దిగుమతి చేసుకొన్న ఈ భారీ క్రేన్లను అట్లాంటాస్పెన్‌జా అనే నౌకద్వారా తెప్పించారు. ఏడవ బెర్తు వద్ద లంగరు వేసి వున్న నౌక నుంచి ఈ క్రేన్లను పోర్టుకు చేరవేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కల్గిన వీటి ద్వారా ఎగుమతి, దిగుమతులను వేగంగా జరపవచ్చని యజమాన్యం తెలిపింది. ఒక్కొక్క క్రేన్ ద్వారా గంటకు 1683 టన్నుల ఖనిజాన్ని ఎగుమతి దిగుమతి చేయవచ్చుట. వీటివలన సామర్థ్యం రెండింతలు పెరగనున్నట్లు పోర్టు సిబ్బంది చెప్తున్నారు.

# రైలు ప్రయాణీకుల ఇక్కట్లు

జనరల్ బోగీలేవి?

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సీట్ల సంఖ్య ప్రయాణీకులకు తగినంతగా లేనందువల్ల ప్రయాణీకులు అవస్థలు పడుతూ ప్రయాణించాల్సి వస్తోంది. సాధారణ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు రైల్వేశాఖ ఇటీవల సూపర్‌ఫాస్టు బోర్డులు తగిలించడంతో ఎక్కువ మొత్తం ప్రయాణీకుల నుంచి వసూలు చేస్తున్నారు. కానీ ఈ రైళ్లలో జనరల్ బోగీలు తక్కువగా వుండడంతో టిక్కెట్‌కొన్న ప్రయాణీకునికి కూర్చొనేందుకు అవకాశం వుండడం లేదు. ముఖ్యంగా చెన్నై - అహ్మదాబాద్ నవజీవన్, విజయవాడ, చెన్నై- హైదరాబాద్, విశాఖపట్నం-తిరుపతి, కాకినాడ - తిరుపతి రైళ్లలో ప్రయాణించాలంటేనే కష్టంగా వుందని ప్రయాణీకులు వాపోతున్నారు. జనరల్ బోగీలు కిటకిటలాడుతుండడంతో కాలు మోపేందుకు కష్టంగా వుందని, గూడూరు, విజయవాడ, తిరుపతి, చెన్నై మార్గాలలో ప్రయాణించాలంటేనే నరకయాతనగా వుందని ఆవేదన చెందుతున్నారు. దీనిని గుర్తించి అధికారులు సీట్ల సంఖ్యను పెంచాలని కోరుకొంటున్నారు.

• సబ్సిడీ

## వ్యవసాయ పరికరాలేవి?

రాయితీపై తక్కువ ధరకు యంత్ర పరికరాలు అందుతాయని ఆశపడ్డ రైతులకు అవి అందని ద్రాక్షపండులా మారాయి. పరికరాల కోసం డిడిలు చెల్లించిన రైతులకు మూడేళ్లు గడుస్తున్నా అందని వైనం కావలిలో చోటు చేసుకొంది. రైతులకు పవర్‌స్ప్రేయర్లు, తైవాన్ చేతిపంపులు, స్ప్రేయర్లు, ట్రాక్టర్ సేద్య పరికరాలపై 50శాతం రాయితీతో ప్రభుత్వం సరఫరా చేస్తుంది. కొత్తపల్లి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే రైతు 2006 నవంబర్‌లో తైవాన్ స్ప్రేయర్ల కోసం

### మూడేళ్లుగా ఎదురుచూపులు

6300 రూపాయలకు డిడి కట్టాడు. అప్పటి నుంచి మూడేళ్లు గడుస్తున్నా పరికరాల కోసం వ్యవసాయశాఖ కార్యాలయం చుట్టు తిరుగుతూనే వున్నా ఫలితం శూన్యం. చెన్నాయపాళెం, అన్నగారిపాళెం, గౌరవరం, తాళ్లపాళెం గ్రామాలలోని పలువురు రైతులదీ ఇదే పరిస్థితి. అధికారులను ప్రశ్నిస్తే గతంలో పనిచేసిన అధికారులు ఎవరూ సరిగా రికార్డులు నిర్వహించనందున తమకు వివరాలు తెలియడం లేదని అంటూ తప్పించుకొంటున్నారని రైతులు వాపోతున్నారు.

పట్టపగలు

## నక్కల సంచారం



రాత్రివేళల్లో మాత్రం కన్పిస్తూ మనుషులను చూడగానే పారిపోయే నక్కలు పట్టపగలు ఇళ్ల మధ్య సంచరిస్తూ బీభత్సం సృష్టిస్తున్న వైనం చిన్నచెరుకూరులో చోటుచేసుకొంది. నక్కలు గ్రామంలోని దళితవాడలో మూడురోజులుగా సంచరిస్తూ భయభ్రాంతులు సృష్టిస్తున్నాయి. కాలనీలో ఇళ్ల మధ్య తిరుగుతూ కోళ్లను చంపి తింటుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. ఎవరూ లేని ఇళ్లలో దూరి వస్తువులను చిందర వందర చేస్తున్నాయి. చిన్న పిల్లలు నక్కలను చూసి భయపడిపోతున్నారు. రాత్రివేళల్లో తిరుగాడుతూ అదోరకంగా అరుస్తుండడంతో నిద్రలేక ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.




కీ॥శే॥ టి.వి.రమణారెడ్డి గారు
(మరణం 11.11.1974)

సంస్కృతి

తెలుగు సినీ ప్రపంచాన్ని
తన హాస్య నటనతో ఉర్రూతలూగించిన
టి.వి.రమణారెడ్డి గారు
స్వర్గస్తులై 11.11.2009తేదికి
35 సంవత్సరాలు పూర్తవుతాయి.
వారిని సంస్మరించుకుంటూ...

కుటుంబ సభ్యులు

# 50 ఏళ్లుగా కాళిదాస్ కళానికేతన్ సంగీత, సాహిత్య కళార్చన!

పాశ్చాత్య సాంప్రదాయపు పెను తుఫానుకు రెపరెపలాడుతున్న భారతీయ సంగీతానికి తిరిగి జవసత్వాలు కల్పించేందుకు తమవంతు సహకారం అందిస్తున్న వారిని వేళ్లమీద లెక్కపెట్టవచ్చు. సంగీతం, కళలపై వున్న మక్కువతో కళారంగాన్ని శ్వాసిస్తూ ఎందరో కళాకారుల జీవితాలకు ఊపిరిలూదుతున్న వ్యక్తి గూడూరుకు చెందిన గౌస్‌బాషా. స్వతహాగా కళాకారుడైన ఆయన తన జీవితాన్ని కళారంగానికి అంకితం చేశారు. గొప్ప కళాకారులను సినీరంగానికి అందించాలన్న తపనతో శ్రీ కాళిదాస కళానికేతన్‌ను 1959లో ఏర్పాటు చేశారు. ఆనాటి నుంచి నేటి వరకు క్రమం తప్పకుండా ప్రతి ఏటా జాతీయస్థాయిలో సినీ, జానపద, లలిత సంగీత పోటీలను నిర్వహిస్తుండడం గౌస్‌బాషాకు కళల పట్ల, సంగీతం పట్లగల మక్కువను తెలియజేస్తుంది. సంపాదన ధ్యాస లేకుండా కళామతల్లికి సేవ చేయాలన్న ఏకైక లక్ష్యంతో గత 50 సంవత్సరాలుగా కాళిదాస కళానికేతన్ చేస్తున్న కృషికి నిదర్శనం అప్రతిహతంగా సాగుతున్న జాతీయస్థాయి పాటల పోటీలు.



కాళీదాస కళానికేతన్ కార్యక్రమంలో పాల్గొన్న చిరంజీవి.

### బాలును వెలికి పట్టాడు

బంగారు పళ్లెమైనా నిలిపేందుకు ఒక ఆసరా అవసరం. అలాంటి మట్టిలో మాణిక్యం గౌస్. ఆర్థికంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నా లెక్క చేయక తాను నమ్ముకొన్న కళారంగానికి సేవ చేసేందుకు పరితపిస్తున్న వ్యక్తి. వేల సంఖ్యలో వివిధ భాషల్లో పాటలుపాడి తన గానంతో సంగీతాభిమానుల్ని ఓలలాడిస్తున్న విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలసుబ్రమణ్యం సినీరంగానికి పరిచయం అయ్యేందుకు ఈ కాళిదాస కళానినేతన్ వేదిక అయ్యింది. 1962, 63, 64 సంత్సరాల్లో ఈ సంస్థ నిర్వహించిన పాటల పోటీల్లో మూడు సార్లు వరుసగా బహుమతులు గెలచుకొని తద్వారా సినీరంగానికి పరిచయం అయ్యాడు బాలసుబ్రమణ్యం. 1966లో కోదండపాణి సంగీతాన్ని సమకూర్చిన మర్యాద రామన్న చిత్రం ద్వారా గాయకుడిగా చిత్రసీమలోకి ప్రవేశించగలిగాడు. బాలు లాంటి ఎందరికో బంగారు బాటలు వేసిన సంస్థగా పేరుగడించింది కాళిదాస కళానికేతన్.

కళారంగం పట్ల వున్న మక్కువతో ఉద్యోగాన్ని సైతం వదలుకొన్న గౌస్‌బాషా ఒకానొక దశలో సంస్థ నిర్వహణ కోసం సొంత ఇంటి స్థలాన్ని అమ్ముకొన్నారంటే ఆయన కళారాధనను ప్రశంసించవలసిందే. ఎంత బిజీగా వున్నా ప్రతి ఏడాది బాలసుబ్రమణ్యం కాళిదాస కళానికేతన్ సంగీత పోటీలకు వచ్చి సంస్థలో తనకు గల అనుబంధాన్ని చాటి చెపుతుంటారు. తాను సినీరంగానికి వెళ్లేందుకు దోహదపడిన గౌస్‌బాషాను నెల్లూరులోని మిత్రుడి జ్ఞాపకార్థం ఏర్పాటుచేసి నిర్వహిస్తున్న కామేశ్వరరావు నాటిక కళాపరిషత్‌లో ఘనంగా సన్మానించాడు బాలసుబ్రమణ్యం. 1961 నుంచి నేటి వరకు ఎందరో అతిరథ మహారథులైన సినీసంగీత దర్శకులు, గాయకులు, నటులను పిలుచుకొని వచ్చి కార్యక్రమాలు నిర్వహిస్తున్న గౌస్‌బాషా సంగీత నృత్య పాఠశాల ఏర్పాటు చేసి కళాకారులను వెలుగులోకి తేవాలన్నదే తన లక్ష్యం అంటున్నాడు.



బాలుతో గౌస్‌బాషా.



గౌస్‌బాషాను సన్మానిస్తున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం.

## ట్రంకు రోడ్డు కబుర్లు

### గాంధీజీని గబ్బు పట్టించారు



నెల్లూరు ట్రంకురోడ్డులోని గాంధీబొమ్మ సెంటర్ నగరానికి గుండెకాయ వంటి ప్రాంతం. నిత్యం వేలాది మంది ఈ సెంటర్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. అటువంటి ముఖ్య ప్రాంతం గతవారంలో నాలుగు రోజుల పాటు మురికి మడుగులా తయారయ్యింది. అప్పుడెప్పుడో నగరంలో ఏర్పాటుచేసిన భూగర్భ డ్రైనేజి పొట్టపగిలి గాంధీబొమ్మ సెంటర్‌లో మురికినీరు వరద ప్రవాహాన్ని తలపించింది. రాష్ట్ర పురపాలక మంత్రి స్వంత ఇంటికి కూతవేటు దూరంలో జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహం వున్న ప్రాంతంలో మురికి వాసనకు జనం ముక్కుపుటాలు పగిలి తిట్లకు లంఘించుకొన్నాక కార్పొరేషన్ సిబ్బంది స్పందించలేదంటే వీరి చర్మం ఎంత దళసరిగా తయారయ్యిందో అర్థం చేసుకోవచ్చు.

### ఇరుక్కుపోయిన వివేకా



ఎరక్కపోయి వచ్చాను ఇరుక్కుపోయాను పాటను పాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డికి. వైఎస్.జగన్‌ను ముఖ్యమంత్రిని చేయకుంటే రాష్ట్రంలో తొలి రాజీనామా తానే చేస్తానని వివేకానందరెడ్డి పెద్దగొంతుకతో ఎప్పుడో చెప్పారు. కానీ ఈ విషయంలో ధైర్యం చేసి మంత్రిణి కొండా సురేఖ రాజీనామా చేశారు. ఈ వార్త వెలువడిన వెంటనే ఓ దినపత్రిక విలేకరి ఆయనకు ఫోన్ చేసి సంగతేమిటని అడిగారు. గంట తర్వాత చెబుతానన్న వివేకా ఇక ఆ విలేకరి రాత్రంతా ఫోను చేస్తున్నా కట్ చేస్తూనే వుండినాడు. రెండో రోజుకు తేరుకుని సురేఖ రాజీనామా వ్యవహారం ఆమె వ్యక్తిగతం. ఈ విషయంలో తాను స్పందించాల్సిన అవసరమే లేదని తప్పించుకొనే ప్రయత్నం చేశారాయన.

### చేపల పులుసు ఇష్టమన్న వినాయకుడు



వినాయకుడు సినిమాలో టైటిల్ రోల్ పోషించిన నటుడు కృష్ణుడు ఈవారంలో విలేజ్‌లో వినాయకుడు సినిమా ప్రమోషన్‌లో భాగంగా నెల్లూరుకు వచ్చారు. పేరుతగ్గట్టే ఈ సినిమా వినాయకుడు మంచి భోజన ప్రియుడు. నెల్లూరు చేపల పులుసుతో సుష్టుగా భోంచేసిన వినాయకుడు తనకు నెల్లూరులో ఘనత వహించిన వంటకం బొమ్మిడాల పులుసన్నా ఇష్టమని లొట్టలేశాడు. దాన్ని సైతం ప్యాక్ చేయించి తెచ్చి ఇచ్చారు ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్.

### అయ్యోరే ఇన్‌ఛార్జ్!



నెల్లూరు నగరంలో కాంగ్రెస్‌పార్టీ సభ్యత్వ స్వీకరణ కార్యక్రమం బహురంజుగా జరుగుతోంది. రాజీవ్‌భవన్ నిర్వాహకుడు అనిల్‌కుమార్ చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డిని చికాకు పెడుతోంది. వాళ్లను నమ్మొద్దు... మా శిబిరాల్లోనే సభ్యత్వం స్వీకరించమని వివేకా మొత్తుకుంటున్నా కార్యకర్తలు పట్టించుకోవడం లేదు. దీంతో ఆయన నగర కాంగ్రెస్ పార్టీకి చాట్ల నరసింహారావే ఇన్‌ఛార్జి... అతను కాదని బాలాజీనగర్‌లో ప్రకటించారు. అన్ని డివిజన్లలో అయ్యోరు, మేయర్ కలసి సభ్యత్వాలు తీసుకొంటారన్నారు. అయినా ఆయన మాటవినేవారే కరవయ్యారు. అదీ సంగతి.

### షేర్ ఆటోల్లో దొంగలు



నెల్లూరు నగరంలోని దొంగలు మహా తెలివిమీరి పోయారు. పాతకాలంలో దొంగల మాదిరి ఇళ్లతాళాలు పగులగొట్టడం, కన్నాలు వేయడం వంటి పద్ధతులకు స్వస్తి చెప్పారు. టిప్‌టాప్‌గా తయారయ్యి నగరంలోని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి కేవలం ఐదు రూపాయల ఛార్జీకే తీసుకెళ్లే షేర్ ఆటోల్లో ప్రయాణీకుల మాదిరి ఎక్కుతున్నారు. తమ హస్త లాఘవంతో మహిళల హ్యాండ్‌బాగులను తెలివిగా కోసేస్తున్నారు. బ్యాంకుల నుంచి నగదు, నగలు సంచులు, బ్యాగుల్లో తీసుకెళ్లే వ్యక్తుల నుంచి తెలివిగా కొట్టేస్తూ ఇటీవలకాలం కలసిరాక చిక్కిపోయి తాము చేసే దొంగతనాల తీరును వెల్లడించేసరికి ఆశ్చర్యపోవడం పోలీసుల వంతయ్యింది.

జమీన్‌రైతు
పొగతోట, నెల్లూరు - 524 001
ఫోన్: 0861 - 2327354
సెల్: 98489 66190
జీవిత చందా రూ.1000లు
సంవత్సర చందా
విదేశాలకు రూ.1000లు

# ఇనమడుగులో కానరాని అభివృద్ధి!

కోవూరు మండలం ఇనమడుగు గ్రామ పంచాయితీలో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామంలో సిమెంటురోడ్ల నిర్మాణం అసలు కనిపించడం లేదు. మురికినీరు పోయేందుకు డ్రైనేజి కాల్వలు లేకపోవడం వలన ఇబ్బందికరంగా వుంటుంది. గ్రామంలో లైబ్రరీ వున్నా అది ఏమాత్రం గ్రామస్తులకు ఉపయోగపడడం లేదు. ఇక్కడ సర్పంచ్‌గా తెలుగుదేశం పార్టీకి చెందిన గిద్దలూరు ఉమ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో కోవూరు ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసుల రెడ్డి సహకారంతో కొంతమేర సిమెంటురోడ్ల నిర్మాణం జరిగిందని గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రస్తుతం తెలుగుదేశంపార్టీకి చెందిన నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నా పంచాయితీ అభివృద్ధికి మాత్రం కృషి చేయడం లేదన్న అభిప్రాయం అందరిలో కనిపిస్తుంది. ఇటీవల ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అధికారపార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో సన్నిహితంగా వుంటున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలోనైనా పంచాయితీకి అవసరమైన నిధులను కేటాయించేలా చేయలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో వుండడం, ఇక్కడ తెలుగుదేశం పార్టీకి చెందిన మద్దతుదారు సర్పంచ్ కావడం వలన అభివృద్ధి పనుల విషయంలో వెనుకబడిపోతున్నారు.

గ్రామ పంచాయితీ కార్యాలయానికి ఏదోఒక సమయంలో పంచాయితీ కార్యదర్శి వెళ్తుంటాడు. సర్పంచ్ ఉమ సమావేశాలకు తప్ప మిగిలిన రోజుల్లో కార్యాలయానికి రావడం లేదు. ఈ పంచాయితీలో 1500 కుటుంబాలు, 15వేల జనాభా, 10వేల మంది ఓటర్లు వున్నారు. ఇంటిపన్నులు వసూలు చేసే దిక్కులేకుండా పోయింది. ఎస్.ఎఫ్.సి నిధులు, 12వ ఆర్థిక సంఘం నిధులు అంతంత మాత్రంగానే మంజూరవుతున్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం క్రింద గ్రామంలోని అంతర్గత రోడ్ల నిర్మాణం చేపట్టే అవకాశం వున్నా ఆ దిశగా గ్రామ సర్పంచ్ ఎటువంటి ప్రయత్నాలు చేయడం లేదని తెలుస్తుంది. ఇందిరమ్మ గృహాలు, వృద్ధాప్య పెన్షన్ల మంజూరులో కూడా చాలా వెనుకబడి వుంది.

మరో ఏడాదిలో పంచాయితీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో పంచాయితీ పాలకవర్గం అభివృద్ధి పనులు చేపట్టే విషయంలో మరింత ముందుకు సాగాల్సిన అవసరం వుంది. ఈ నేపథ్యంలో స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలు, చేపట్టిన అభివృద్ధి పనులపై పలువురు వెల్లడించిన అభిప్రాయాలను ప్రచురిస్తున్నాం.



ఇనమడుగు గ్రామ పంచాయితీ కార్యాలయం.



### డ్రైనేజి కాల్వలు ఏర్పాటు చేయాలి!

గ్రామ పంచాయితీ పరిధిలో ముందుగా డ్రైనేజి కాల్వలను ఏర్పాటు చేయాల్సి వుంది. డ్రైనేజి కాల్వలు లేకపోవడం వలన మురికి నీరంతా వీధులలో చేరి దుర్వాసన వెదజల్లుతున్నది. పంచాయితీ సర్పంచ్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి డ్రైనేజి కాల్వల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– టి.రమణారెడ్డి, స్థానికుడు



### గ్రంథాలయాన్ని ఉపయోగంలోకి తేవాలి!

గ్రామంలో దాతల సహాయంతో నిర్మించిన గ్రంథాలయం గ్రామస్తులకు ఉపయోగపడకుండా పోయింది. ప్రస్తుతం గ్రంథాలయం భవనంలో ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. పంచాయితీ ఆధ్వర్యంలో దినపత్రికలకు నిధులు చెల్లించకపోయినా గ్రామస్తులు చెల్లించేందుకు ముందుకు వస్తున్నారు. వెంటనే జిల్లా పంచాయితీ అధికారులు స్పందించి గ్రంథాలయ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి.

– రాంప్రసాద్‌రెడ్డి, స్థానికుడు

---

**అవినీతి కథ**

● ఎఇల బదలీల్లో లెక్కలేనన్ని అక్రమాలు

# గృహనిర్మాణ శాఖలో రవిప్రకాష్ హవా!



నెల్లూరులోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయం.

గృహనిర్మాణశాఖలో జిల్లావ్యాప్తంగా ఇటీవల ఎఇల బదలీలు జరిగాయి. ఈ బదలీల్లో అధికారులు భారీస్థాయిలో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. పరిపాలనా సౌలభ్యం కోసం చేట్టిన ఎఇల బదలీల్లో రాజకీయ పలుకుబడితోపాటు అధికారులు కోరిన మేరకు ముడుపులు అందజేసిన వారికి కోరినచోట నియామక ఉత్తర్వులు అందజేశారు. రాజకీయ పలుకుబడి, ముడుపులు అందజేయని వారిని మాత్రం జిల్లా సరిహద్దులోని మండలాలకు బదలీ చేశారు. ఈ బదలీల విషయంలో అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడడంపై ఆ శాఖలో చర్చ జరుగుతుంది.

జిల్లా గృహనిర్మాణశాఖలో ముగ్గురు అధికారులు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జిల్లా మేనేజర్, సూపరింటెండెంట్ ఇంజనీరు, ప్రత్యేక అధికారి ఇలా ముగ్గురు అధికారులు ఇందిరమ్మ గృహాల నిర్మాణ పనులు పర్యవేక్షిస్తుంటారు. మండల స్థాయిలో ఇందిరమ్మ గృహాల నిర్మాణ పనులను పర్యవేక్షించేందుకు ఎఇల నియామకం చేపట్టింది ప్రభుత్వం. ఎఇలు సాంకేతికపరమైన అంశాలను పరిశీలించి నాణ్యతగా ఇళ్లు నిర్మించేందుకు విధులు నిర్వహిస్తుంటారు. సాంకేతికపరమైన అంశాలతో కూడిన ఎఇల పనితీరును ఆ శాఖ ఎస్ఇ, మేనేజర్ నిత్యం పర్యవేక్షిస్తుండాలి.

సాధారణ బదలీల్లో భాగంగా ఎఇల బదలీ ప్రక్రియ చేపట్టేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. బదలీల విషయంలో అధికారులు నిబంధనలను ఏమాత్రం పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు కనిపిస్తుంది. జిల్లా మేనేజర్, ఎస్ఇలతో ప్రమేయం లేకుండా ప్రత్యేక అధికారిగా నియమితులైన రవిప్రకాష్ అంతా తానై బదలీల కార్యక్రమం నడిపించారు. వాస్తవంగా ప్రత్యేక అధికారిక బదలీల విషయంలో ఎటువంటి జోక్యం చేసుకోకూడదు. అయితే తాను ప్రత్యేక అధికారినన్న ధీమాతో మిగిలిన అధికారులను బెదిరిస్తూ మొత్తం పరిపాలన అంత తాను చెప్పినట్లుగా నడవాలని ఆదేశిస్తున్నాడు.

జిల్లా మేనేజర్, ఎస్ఇల ఆధ్వర్యంలో ఎఇల బదలీలు జరపాల్సి వుంటుంది. చాలా సంవత్సరాలుగా జిల్లాలో వివిధ శాఖల్లో అధికారిగా రవిప్రకాష్ కొనసాగుతున్నారు. ఈ క్రమంలో ఆయనకు రాజకీయ నేతలు, అధికార పార్టీకి చెందిన నాయకులతో సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. రవిప్రకాష్ గృహనిర్మాణ శాఖకు ప్రత్యేక అధికారిగా నియమింపబడిన తర్వాత పెద్దగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తికాక పోగా, వేలాది ఇళ్లను రద్దు చేశారు. డిఇ, ఎఇల పర్యవేక్షణలో మొత్తం నిర్మాణ పనులు జరుగుతుంటాయి. ఈయన కేవలం చుట్టపుచూపుగా అప్పుడప్పుడు ఎసి కారులో పర్యటిస్తుంటాడు.

జిల్లావ్యాప్తంగా 23 మంది ఎఇలను బదలీ చేయడం జరిగింది. కోరిన మండలానికి బదలీ కావాలని కోరిన వారి నుంచి 15 నుంచి 20వేల రూపాయలు వసూలు చేసినట్లు తెలిసింది. అన్ని వసతులు కలిగి జిల్లా కేంద్రానికి సమీపంలో వుండే మండలాలకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. బదలీల సందర్భంగా అధికారులు అవలంభించిన విధానాల కారణంగా ఆ శాఖలోని ఎఇలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాలుగురూపాయలు సంపాదించుకోవచ్చున్న ఆశతో బదలీ చేయించుకునేందుకు ప్రత్యేక అధికారి కోరిన విధంగా ముడుపులు చెల్లించుకోక తప్పటంలేదని వారు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ఇప్పటికే గృహనిర్మాణశాఖకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లుల మంజూరు, వ్యవహారంపై పలు అవినీతి, ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఎఇల బదలీల వ్యవహారంలో మరిన్ని అవినీతి, అక్రమాలు చోటు చేసుకోవడం విశేషం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో జరిగిన ఎఇల బదలీల వ్యవహారంపై విచారణ జరపాలని ఆ శాఖలో పనిచేసే ఎఇలు ఉన్నతాధికారులను కోరుతున్నారు. ◆



## గ్యాంగ్‌లీడర్‌గా టబు

దేశంలోనే పేరుగాంచిన మేకప్ నిపుణుడు సుభాష్‌సింగ్ నిర్మాతగా బెంగాలీ ఫిలిం మేకర్ షామిక్‌సేన్ దర్శకత్వం వహిస్తున్న చిత్రం గులాబీగ్యాంగ్. యు.పి.లో జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా తీస్తున్న ఈ చిత్రంలో టబు, రవీనాటాండన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. గులాబీగ్యాంగ్ అంటే మహిళలు. వాళ్లంతా గులాబీరంగు చీరలు కట్టుకొంటారు. స్త్రీలపట్ల అన్యాయం, అక్రమం జరిగితే సహించరు. ఎంతటి పోరాటమైనా చేస్తారు. హాలీవుడ్‌లో తయారైన '300' సినిమా తరహాలో యాక్షన్ సన్నివేశాలు పెడుతున్నారు. దీనికోసం ఈ చిత్రంలో నటించే మహిళలకు పోరాట దృశ్యాలలో శిక్షణనిస్తున్నారు. ఈచిత్రం తనకెంతో పేరు తెచ్చిపెడుతుందని హైదరాబాద్‌లోనే సెటిల్ అయిన టబు విశ్వాసం వ్యక్తం చేస్తుంది.



## హీరోయిన్‌ను గుర్తించండి!

అప్పుడెప్పుడో 'శ్రీను, వాసంతి లక్ష్మి' చిత్రంలో నటించిన పద్మప్రియ తమిళ, మళయాళ భాషా చిత్రాల్లో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకొంది. ప్రస్తుతం దర్శకుడు చంద్రసిద్ధార్థ తీస్తున్న చిత్రం "అందరి బంధువయా"లో హీరోయిన్‌గా నటిస్తుంది. షాట్‌గ్యాప్‌లో పిచ్చాపాటీగా మాట్లాడుతూ నాకు సినిమాలంటే ఇష్టం. తమాషాగా హీరోయిన్‌నయ్యాను. సినిమా జయాపజయాల్లో హీరో, దర్శకుడికి ఎంత బాధ్యత వుంటుందో హీరోయిన్‌కు అంతే. కాకపోతే సినిమా హిట్ అయిన వెంటనే ఆ కీర్తిని మొత్తం హీరోకే ఆపాదిస్తుంటారు. ఇది మరీ అన్యాయం కదండీ అంటుంది అమాయకంగా పద్మప్రియ. హీరోయిన్లు సినిమాల్లో కేవలం అందాల బొమ్మలు కావడం వల్ల విజయం తాలుకు క్రెడిట్ హీరోలు, దర్శకులకే ఆపాదించబడుతుందని ఈ కొత్త హీరోయిన్ గ్రహించినట్లు లేదు.



## దిమ్మ తిరిగిన దిల్‌రాజు

తెలుగులో ఈ మధ్య తిరుగులేని నిర్మాత అంటూ దిల్ రాజును అందరూ ఆకాశానికి ఎత్తేశారు. కాని ఆయన ఇటీవల నాగచైతన్య హీరోగా తీసిన జోష్ సినిమా ఫట్‌మంది. రాజు నైజాంలో పంపిణీ చేసిన 'మల్లన్న' భారీ నష్టాలను మిగిల్చింది. గణేష్ చిత్రం అదే రీతిన నడిచింది. తానెంతో తెలివైన వాడినని, ఏది చేపట్టినా విజయం తథ్యమని రాజు విర్రవీగేవారట. ఇప్పటికైనా ఆయన తగ్గుతాడో లేదో చూడాలని పరిశ్రమలోని వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

## హిందీ మగధీరలో అద్భుతాలు

తెలుగులో అద్భుత విజయాన్ని సాధించిన మగధీర చిత్రాన్ని హిందీలో అల్లు అరవింద్, మధుమ్యాన్‌టెన్‌లు కలసి తీస్తున్నారు. చిత్రంగా ఈ సినిమాలో అమీర్ ఖాన్, హృతిక్‌రోషన్లు ప్రధాన పాత్రలు పోషించనున్నారు. 17వ శతాబ్దపు మగధీరునిగా హృతిక్‌రోషన్, నేటితరం మగధీరునిగా అమీర్ ఖాన్ అలరించనున్నారు. ఐశ్వర్యరాయ్, కత్రినా కైఫ్, అసిన్‌ల పేర్లు హీరోయిన్లుగా పరిశీలిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వం వహించే ఈ చిత్రంలో మరెన్నో సాంకేతిక అద్భుతాలకు చోటు కల్పించనున్నట్లు ఫిల్మ్‌నగర్ వర్గాల కథనం.

## తనుశ్రీని దూరం పెట్టారు!

తెలుగులో ఒకేఒక్క చిత్రం వీరభద్రలో హీరోయిన్‌గా నటించిన తనుశ్రీదత్తాకు బాలీవుడ్‌లోనూ అవకాశాలు తగ్గాయి. ఇదే విషయాన్ని ఇటీవల భాగ్యనగరానికి వచ్చిన తనుశ్రీని ప్రశ్నిస్తే నేనే కావాలని బ్రేక్ తీసుకొన్నాను తప్ప అవకాశాలు లేక కాదని సన్నాయి రాగాలు తీసింది. అసలు విషయాన్ని ఆరా తీస్తే షూటింగ్ సమయంలో ఆమె దురుసుగా ప్రవర్తిస్తుందని, కాల్షీట్ల సమయంలో నిర్లక్ష్యంగా నిర్మాతలతో ఆడుకోవడంతోపాటు ఇష్టమొచ్చినట్లుగా రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నదట. దీంతో బాలీవుడ్ నిర్మాతలు కూడబలుక్కొని ఈ అమ్మడిని తమ చిత్రాలకు దూరంగా పెట్టారట.



## సరకులేని ఏక్‌నిరంజన్!

అల్లూరు రహీం

చిత్ర సమీక్ష

తెలుగు సినీ పరిశ్రమలో పెద్ద దర్శకుడన్న ఇమేజ్‌ను సొంతం చేసుకొన్న పూరీ జగన్నాథ్, ప్రభాస్‌ను హీరోగా పెట్టి తీసిన పరమ పేలవ చిత్రం ఏక్‌నిరంజన్. ఈ చిత్ర కథ, కథనంలో కొత్తదనం లేదు.



జాగ్రత్తగా చూస్తే గతంలో ప్రభాస్ హీరోగా పూరీజగన్నాథ్ తీసిన 'బుజ్జిగాడు మేడిన్ చెన్నై'కు ఈ చిత్రానికి పెద్ద తేడానే కనిపించదు. హీరో ప్రభాస్ కెరీర్‌లో అత్యధికంగా ఖర్చు పెట్టింది, ఈ సినిమా నిర్మాత ఆదిత్యా రామ్ నెత్తిన శఠగోపం పెట్టించడం మినహా సరకు లేనిదని చెప్పేయవచ్చు. ఏక్‌నిరంజన్ సాంఘిక చిత్రం. కానీ ఇందులో దర్శకుడు సృష్టించిన అలీ పాత్ర జానపద చిత్రాల్లోని మాంత్రికునిలా అలా వచ్చి ఇలా మాయమై పోతుంటుంది. ఇదెలా సాధ్యమో దర్శకులవారే శెలవియ్యాలి. బ్రహ్మానందం, అభినయశ్రీ, అలీ, వేణు మాధవ్ కాంబినేషన్‌లో సాగే మోటు హాస్యకదంబం కుటుంబసమేతంగా ఈ చిత్రానికి వెళ్లిన వారిని ఇబ్బంది పెడుతుంది. అరుంధతి చిత్రంలో మహోగ్ర నటనతో అందరి మెప్పు పొందిన విలన్ సోనూ సూద్‌ను ఏక్‌నిరంజన్‌లో కామెడీ విలన్‌ను చేసి పూరీజగన్నాథ్ అతని కెరీర్‌ను అంతం చేశాడని పిస్తుంది. మణిశర్మ మనసు పెట్టి సంగీతం కూర్చడంతో ఈ చిత్రంలో నాలుగు పాటలు బాగా కుదిరాయి. ఈ చిత్రానికి మాటలు కూడా జగన్నాథే వ్రాశాడు. ఏడ్చే మగాళ్లను నమ్మకూడదు, పిచ్చి నాకొడకా కూడా గొప్ప డైలాగులా?

చిత్ర కథలోనికి వెళ్తే ఫుట్‌పాత్ మీద జీవనం వెళ్లదీస్తుండే తనికెళ్ల భరణి, సంగీత దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్దవాడు కైలాష్(ముఖుల్‌దేవ్), చిన్నవాడు నిరంజన్(ప్రభాస్). నిరంజన్ ఊయలలో వుండగా చిన్నపిల్లలను పట్టుకెళ్లేవ్యక్తి తీసుకెళ్లిపోతాడు. అతని చేత బిక్షమెత్తిస్తూ బతుకుతుంటాడు. అక్కడ నిరంజన్ పేరు ఛోటుగా మారిపోతుంది. కైలాష్ సంఘవిద్రోహ కార్యక్రమాలు చేస్తూ పెద్ద డాన్ జానీభాయ్ (సోనూ సూద్) దగ్గర పనికి కుదురుతాడు. తనతో పాటు ఎందరో పిల్లలను ఏడిపించే దుర్మార్గుడిని ఛోటు పోలీసులకు పట్టిస్తాడు. కానీ ప్రతి వారం జైలుకు వచ్చి అతడ్ని పరామర్శించి తన తల్లితండ్రులెవరో చెప్పమని బ్రతిమాలుతుంటాడు. పోలీసు ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ బ్రతుకుతుండే ఛోటుకు తమ బస్తీలోని గిటార్ నేర్పించే టీచర్ సమీర(కంగనారనౌత్) తారస పడుతుంది. ఈమె సోదరుడు మనోజ్ కూడా జానీభాయ్ దగ్గర పని చేస్తుంటాడు. ఛోటు తల్లితండ్రులు సైతం అతను వుండే బస్తీలో నివసిస్తుండినా తెలుసుకోలేకపోతాడు. మంత్రి రాజేంద్రకుమార్(పృధ్వీరాజ్)ను జానీభాయ్ కైలాష్ చేత చంపిస్తాడు. కైలాష్ విషయమై బస్తీకి దర్యాప్తుకు వచ్చిన ఇన్‌స్పెక్టర్(సత్యప్రకాష్) సంగీత, తనికెళ్ల భరణి దంపతులను తీవ్రంగా హింసించడం చూసిన ఛోటు అతనిపై కలియబడతాడు. తన మనుషులు కైలాష్, మనోజ్ దౌర్జన్యాలకు అడ్డుతగులున్న ఛోటుకు జానీభాయ్ రెండు మూడు సార్లు తారసపడతాడు. ఇంతలో మంత్రి రాజేంద్రకుమార్ తమ్ముడు నరేంద్ర (పోసాని కృష్ణమురళి) ఉపఎన్నికలు వచ్చి మంత్రి అవుతాడు. అది మొదలు అతను కైలాష్‌ను అంతమొందించమని జానీభాయ్‌ను కోరుతుంటాడు. పోలీస్ కమీషనర్ పరారీలో వున్న కైలాష్ గురించి ఆరాతీయమని ఛోటుకు వివరాలిస్తాడు. తన చెల్లెలిని తనను జైలుకు వెళ్లేలా చేసిన ఛోటు ప్రేమిస్తున్నాడని తెలిసి మనోజ్ అగ్గిమీద గుగ్గిలమవుతాడు. ఆమెను తీసుకొని బ్యాంకాక్ వెళ్తాడు. అక్కడ అతనికి కైలాష్ బస ఏర్పాటుచేస్తాడు. తాను బ్యాంకాక్‌లో వున్నానని సమీర, చంటిబాబు(సునీల్) చేత ఛోటుకు ఫోన్ చేయిస్తుంది. తాను మంత్రిని చంపలేదని, అతని సోదరుడే చంపాడని కైలాష్ తనను బంధించిన ఛోటుకు చెబుతాడు. కైలాష్, మనోజ్‌ల కోసం సమీరను చిత్ర హింసల పాల్జేసే జానీభాయ్‌ను ఛోటు చావచితక కొట్టి తన ప్రియురాలిని హత్తుకోవడంతో చిత్ర కథ ముగుస్తుంది.

# తూగుతున్న తూనికలు కొలతల శాఖ



తూనికలు, కొలతలు సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన ఆ శాఖ నిద్రావస్థలో వుండడంతో వినియోగదారులు అన్నివిధాల నష్టపోతున్నారు. మార్కెట్‌లో కొనే ప్రతి వస్తువు సక్రమంగా తూస్తున్నారా లేదా, వస్త్ర వ్యాపారాలకు వినియోగించే కొలబద్దలు కచ్చితంగా వుంటున్నాయా అని పరిశీలించి ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాల్సిన తూనికలు కొలతల శాఖ సిబ్బంది ఆ విధులు తమవి కాదన్నట్లు ప్రవర్తిస్తుండడంతో కూరగాయల మార్కెట్ మొదలు అన్ని షాపుల్లోనూ వినియోగదారులు మోసపోతూనే వున్నారు. ఎలక్ట్రికల్ తూకాల్లోనూ మోసాలు జరుగుతున్నట్లు పలు సందర్భాలలో ఫిర్యాదులు వచ్చాయి. వస్త్ర వ్యాపారులు సైతం ఏడాదికొకసారి కొలబద్దలను తనిఖీ చేయించి అనుమతి పొందాల్సి వుంటుంది. అటు వ్యాపారులు వీటిని పట్టించుకోక తమ ఇష్టానుసారంగా వినియోగదారులను దగా చేస్తుంటే అలాంటి మోసాలను అరికట్టాల్సిన తూనికలు కొలతల శాఖ కుంభకర్ణ నిద్రలో వుండడంతో వినియోగదారులు నష్టపోతున్నారు.

# మెగాస్టార్ కాదు దగాస్టార్!

## సోమిరెడ్డి విమర్శ



తనను మహానేత ఎన్టీరామారావుతో పోల్చుకొని అవినీతి కాంగ్రెస్‌ను గద్దె దింపుతానని రాజకీయాల్లోకి వచ్చిన ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి ఆ పార్టీకే దాసోహమనడం విడ్డూరంగా వుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. 1వ తేది పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సినిమాల్లో మెగాస్టార్‌గా రాణించిన చిరంజీవి రాజకీయాల్లో దగాస్టార్‌గా మారారని విమర్శించారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్, ప్రజారాజ్యం పార్టీల మధ్య చోటుచేసుకొన్న పొత్తు చర్చలను తీవ్రంగా తప్పుపట్టారు. చిరంజీవి అసలు ఎందుకు రాజకీయపార్టీ పెట్టారో అర్థంకావడం లేదు. ఠాగూర్ సినిమాలో ఆయన అవినీతిని అంతమొందిస్తారు. కానీ రాజకీయాల్లో పీకల్లోతు అవినీతిలో కూరకపోయిన కాంగ్రెస్ పార్టీకి మద్దతివ్వడం బాధాకరం. ఆ పార్టీకి ఉదయించే సూర్యుడు గుర్తు వచ్చి రెండు నెలలయిందని ఇంతలోనే 'హస్త'మించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రజా జీవితం అంటే మేకప్, పేకప్ చెప్పే సినిమా షూటింగ్ కాదన్నారు. రాజకీయాల్లో రాణించాలంటే లక్ష్యం, నిబద్ధత, పట్టుదల వుండాలన్నారు. సమాజంలో మార్పులు తెస్తామని ప్రజల్లో ఆశలు రేకెత్తించిన ప్రజారాజ్యం పార్టీ అతి తక్కువ కాలంలోనే దివాళాతీసి రాజకీయాల్లో చేదుగుళికగా మారిందని చంద్రమోహన్‌రెడ్డి చమత్కరించారు.

# సిబ్బంది కొరత



వ్యాపారకూడలి అయిన నెల్లూరు స్టోన్ హౌస్‌పేట పోస్టాఫీసులో సిబ్బంది కొరత నెలకొని వుంది. అధిక సంఖ్యలో ప్రజలు నివసించే ఈ ప్రాంత పోస్టల్ కార్యాలయంలో దీర్ఘకాలంగా సిబ్బంది కొరత కారణంగా బట్వాడాలో ఇబ్బందులు ఎదురౌతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పరిధిలోని ప్రజలకు సక్రమంగా బట్వాడా జరగడం లేదు. పోస్టుమాస్టర్, పోస్టల్ అసిస్టెంటు, నాల్గవ తరగతి ఉద్యోగులు, పోస్టల్ సిబ్బందికి సంబంధించి దాదాపు 20కి పైగా పోస్టులు ఖాళీగా వున్నాయి. ఎంతోకాలంగా వీటిని భర్తీచేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

**స్టోన్‌హౌస్‌పేట పోస్టాఫీసులో ఎక్కడి పనులు అక్కడే!**

## • రైతులకు మొండిచేయి

# బ్లాక్ మార్కెట్‌లో సబ్సిడీ విత్తనాలు

అన్నివిధాల నష్టపోతున్న వారిలో రైతాంగాన్ని చెప్పుకోవచ్చు. సకాలంలో వర్షాలు కురవక, సాగునీరు అందక, నకిలీ విత్తనాలు, ఎరువులతో నష్టపోయిన రైతులను అధికారులు దగా చేస్తున్నారనేందుకు సబ్సిడీపై పంపిణీ చేసే విత్తనాల్లో జరిగే అక్రమాలే నిదర్శనం. సబ్సిడీ రైతులకు విత్తనాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అన్ని జిల్లాల్లో ఏపి సీడ్స్ ద్వారా పలురకాల వరి వంగడాలను అందిస్తుంది. ఆహార భద్రతా మిషన్ నిధులతో అందించే రాయితీ విత్తనాలను రైతులకు అందజేయకుండా వాటిని ప్రక్కదారి పట్టించి డీలర్లకు చేరవేస్తున్నారు కొందరు సిబ్బంది. బిటిపి 5204, ఎడిడి 37, ఎంటియు 1010, ఎంటియు 1001, ఎన్‌ఎల్‌ఆర్ 34449 తదితరరకాల వంగడాలను కెజి ఒక్కొక్కటి మూడు రూపాయల వంతున రాయితీ ఇస్తారు. రైతులు ఈ విత్తనాల కోసం కార్యాలయానికి వెళ్తే వారికి వీటిని అందజేయకుండా విత్తనాలు అయిపోయాయని, సరిగా మొలకెత్తడం లేదని చెప్తూ ఏపి సీడ్స్ సిబ్బంది రైతులకు వాటిని అందజేయడం లేదట. ప్రభుత్వం అందించే రాయితీ విత్తనాలను కార్యాలయ సిబ్బంది అక్రమంగా డీలర్లకు చేరవేస్తూ రైతులకు మొండిచేయి చూపిస్తుండడంతో అధిక ధరలకు బయట వీటిని కొనుగోలు చేయాల్సి వస్తుంది.

# ఆర్టీఏ ఆఫీసులో డ్రైవింగ్ ట్రాక్



వాహనాల లైసెన్సులు పొందే వారికోసం రవాణాశాఖ కార్యాలయంలో నూతనంగా డ్రైవింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్, వైజాగ్, కాకినాడలో ఏర్పాటు చేసిన తరహాలో నగరంలోనూ ఈ ట్రాక్ ఏర్పాటవుతుంది. రెండు ఎకరాల విస్తీర్ణంలో 40 లక్షల రూపాయల ఖర్చుతో నిర్మిస్తున్న ఈ డ్రైవింగ్ ట్రాక్‌పై ద్విచక్ర వాహనాల నుంచి ఆటోలు, కార్లు, ట్రాక్టర్లు తదితర వాహనాలన్నింటిని ఆర్టీఏ అధికారుల పర్యవేక్షణలో నడిపే అవకాశం వుంటుంది. వివిధ వాహనాల లైసెన్సులు పొందేవారు టెస్టు డ్రైవింగ్ చేయాల్సివుండడంతో ఇప్పుడున్న స్థలంలో అది కష్టంగా వుంది. అందువల్ల ఈ పరిస్థితులలో నూతనంగా దీనిని ఏర్పాటు చేస్తున్నారు.

# పసుపు పంటపై ఆసక్తి

ఉదయగిరి ప్రాంతంలోని రైతాంగం ఇప్పుడు పసుపు పంటపై దృష్టిసారించింది. లాభదాయకంగా వుండడంతో రైతులు కొండక్రింది గ్రామాల్లో ఈ పంటను అధికంగా సాగు చేస్తున్నారు. మండలంలోని బిజ్జంపల్లి, కొత్తపల్లి, అయ్యవారిపల్లి, కృష్ణారెడ్డిపల్లి, వెంగంనేనిపల్లి, తదితర గ్రామాల్లో ఈ పంట సాగవుతోంది. ఎకరా పంట సాగుకు విత్తనం, ఎరువులతో కలసి 35 వేల రూపాయల పెట్టుబడి అవుతున్నా పంట దిగుబడి అనంతరం ఆదాయం బాగా వస్తుండడంతో దీనిని సాగుచేస్తున్నట్లు రైతులు చెప్తున్నారు. ఖరీఫ్‌లో మొదలయ్యే పంట ఏడాదిపాటు కొనసాగి మంచి దిగుబడి నిస్తున్నాదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



నెల్లూరు ట్రంకురోడ్డులో శ్రీరామా ఆప్టికల్స్ వ్యవస్థాపకుడు లేట్ వెలగపూడి హనుమంతరావు కుమారుడు చంద్రశేఖర్, రాధాకుమారిల వివాహం బాలాజీనగర్‌లోని త్యాగరాజ కళ్యాణమండపంలో నవంబర్ 1తేది జరిగింది.

## స్వంత కుంపటి

మొదటి పేజీ కొరవ

తగ్గలేదన్నది నిజం.తనకు చెక్ పెడుతున్నారన్న అనుమానాన్ని భరించలేకపోతున్నాడు జగన్.

అందుకు ప్రజారాజ్యంతో పొత్తు ప్రయత్నాల మీద తన అనుచర బృందాన్ని ఎగతోలాడు. రఘువీరారెడ్డి, అంబటి రాంబాబు వంటి భజన బృందాలు ఒళ్లంతా నోరు చేసుకొని విరుచుకపడ్డాయి. అయితే, ఈ పొత్తు ప్రతిపాదన డిఎస్ స్థాయిలోనో, ముఖ్యమంత్రి స్థాయిలోనో జరగలేదని; ఢిల్లీ నుంచి ఎవరో చక్రం తిప్పడం వల్లనే చిరంజీవి తెరమీదకు వచ్చాడని అర్థంకావడంతో జగన్ శిబిరానికి కాళ్లుచేతులు ఆడలేదు. తనను ముఖ్యమంత్రి చేసే ఆలోచన అధిష్టానానికి అసలు లేదనే నిశ్చయానికి వచ్చేసారు వారు. ఎప్పటికీ అందని ద్రాక్షపండు వంటి పదవి కోసం ఎదురు చూసే కంటే, దాన్ని తమకు తాముగానే తెచ్చుకోవడానికి సిద్ధపడడం మేలన్న చర్చ ఆ శిబిరంలో జోరుగా నడుస్తున్నది. కాంగ్రెస్‌లో మెజార్టీ వర్గం ఇప్పటికీ తనను అనుసరించి వస్తుందన్నది జగన్ నమ్మకం. తాను స్వంత పార్టీ పెడితే కనీసం 70 నుంచి 100 మంది వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తన పక్కన నిలబడతారన్న ధీమాతో వున్నాడాయన.

మెజార్టీ ఎమ్మెల్యేలను బయటకు తెచ్చి, మధ్యంతర ఎన్నికలు తప్పనిసరి చేయడం వీరి వ్యూహంలో ఒక భాగం. వైఎస్ పట్ల జనంలో అపారమైన సానుభూతి వున్నది కాబట్టి, ఆరేడు నెలల లోపల ఎన్నికలు వచ్చేట్లు చేస్తే, తాను పెట్టబోయే పార్టీ 200 వరకు స్థానాలు గెల్చుకొంటుందని ఆశపడుతున్నాడాయన. ఒకవేళ అది జరగకపోయినా, మహారాష్ట్రలో శరద్‌పవార్, పశ్చిమబెంగాల్‌లో మమత బెనర్జీ వలె తాను కూడా కేంద్ర రాజకీయాలలో ఒక కీలకనేతగా ఎదిగే అవకాశం వుందని, తద్వారా సోనియాగాంధీ ముక్కు పట్టి ఆడించవచ్చునని భావిస్తున్నాడు.

అయితే జగన్ శిబిరంలోని ఈ ప్రతిపాదనలు, ఆలోచనలు, చర్చల పట్ల వైఎస్ ఆప్తమిత్రుడైన కెవిపి రామచంద్రరావు విముఖంగా వున్నట్లు వినికిడి. వైఎస్ బ్రతికి వున్నప్పుడు, అధిష్టానం మీద కోపం వచ్చిన రెండు సందర్భాలలో స్వంత పార్టీ ఆలోచన చేశాడని, అన్ని అంశాలు లోతుగా పరిశీలించిన తర్వాత అది జరిగేపని కాదని విరమించుకొన్నాడని, ఆవేశానికి పోయి, అనుభవం లేని పనులు చేయవద్దని సలహా చెప్తున్నాడట ఆయన. కానీ జగన్ శిబిరంలో కెవిపి గొంతు పెద్దగా వినపడే పరిస్థితి లేదిప్పుడు.

పులివెందుల టిక్కెట్ విషయంలో సోనియా నిర్ణయం ఎట్లా వుంటుందో చూసేవరకు వేరు కుంపటి వెలిగించే ఆలోచన పక్కన పెట్టాలని జగన్ ఆంతరంగికులు సలహా ఇస్తున్నాడు. జగన్‌కు భవిష్యత్తులోనైనా అవకాశం ఇచ్చే సానుకూలత సోనియాగాంధీలో వుంటే, పులివెందుల టిక్కెట్ ఆయనకే ఇస్తుందని; అది లేనిపక్షంలో వైఎస్ కుటుంబంలో మరొకరిని రంగంలోకి దించే ప్రయత్నం చేస్తుందని వీరు అంచనా వేస్తున్నారు. ఈ విషయంలో జగన్ సోదరి పేరు ఇప్పటికే ప్రచారంలోకి వచ్చివుంది. పులివెందులలో వైఎస్ కుటుంబీకులు ఎవరు నిలబడినా, ప్రతిపక్షాలు పోటీ పెట్టకపోవచ్చు. తెలుగుదేశం కూడా అదే ఆలోచనలో వుంది. అందువల్ల అక్కడ గెలుపు ఓటముల సమస్య లేదు. ఏకగ్రీవ ఎన్నిక కాబట్టి, సోనియా గాంధీ ఎవరి పేరు చెప్తే వారికే అవకాశం.

మరొకప్రక్క గ్రేటర్ హైదరాబాద్ పేరుతో కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశాన్ని వాయిదా వేయడం కూడా జగన్‌కు కష్టం కల్గిస్తున్నది. తన కోసమే ఈ సమావేశాన్ని వాయిదా వేస్తున్నారన్నది ఆయన నిశ్చితాభిప్రాయం. ఆయన అనుచర శాసనసభ్యులు కూడా అదే వాదనలో వున్నారు. వైఎస్ వంటి మహానేత మరణించి రెండు నెలలు దాటిపోయినా అటు సిఎల్పీలో కానీ, ఇటు శాసనసభలో కానీ సంతాప తీర్మానం చేయకపోవడం ఏమిటని వీరు మండిపడుతున్నారు. కాంగ్రెస్ అధినాయకత్వం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నదని ఆరోపిస్తున్నారు. వైఎస్ కుటుంబం పట్ల అంత విముఖత వున్న అధిష్టానాన్ని నమ్ముకోవడం కంటే మంచో చెడో స్వంత పార్టీ పెట్టుకోవడమే మేలన్నది వీరి వాదన. వ్యాపారాలకు నష్టం వస్తుందని, అక్రమ ఆస్తులపై విచారణ జరుగుతుందని భయపడి వెనక్కు తగ్గితే తమను మరింత వేధిస్తారని; వ్యాపారాలు పోయిన ఫర్వాలేదనే తెగింపుతో అధిష్టానంతో తాడో పేడో తేల్చుకోవాలని కొందరు అభిమానులు జగన్‌ను ఒత్తిడి చేస్తున్నారు.

## రాహుల్ ఆలోచన

మొదటి పేజీ కొరవ

ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో సైతం కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి రాహుల్ గాంధీ ఒక ప్రణాళిక రచించాడని; వైఎస్‌లేని పరిస్థితులలో రేపటి ఎన్నికలలో కాంగ్రెస్‌ను ప్రజలకు చేరువ చేయడానికి తగిన నేత ఎవరూ లేరుకాబట్టి, చిరంజీవి వంటి జనసమ్మోహన శక్తి వున్న నాయకుడిని తమలో కలుపుకొంటే ఆ కొరత తీరుతుందని భావిస్తున్నాడని ఢిల్లీ వర్గాల భోగట్టా. దానికి ప్రారంభ సూచకంగా ప్రజారాజ్యంతో గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో పొత్తు పెట్టుకోవాలని ఆయన సలహా ఇచ్చినట్లు చెప్తున్నారు. అందువల్లనే డి.శ్రీనివాస్ అంత సాహసం చేసి, అల్లు అరవింద్‌తో చర్చలు జరిపారు. జగన్ శిబిరం నుంచి అల్లరి చెలరేగకుంటే, చిరంజీవి కూడా ఈ చర్చలలో పాలు పంచుకొనేవాడు. వైఎస్‌కు బాగా సన్నిహితుడిగా పేరు పడిన బొత్సా సత్యనారాయణ కూడా పిఆర్పీతో పొత్తుకు అనుకూలుడు కావడం గమనార్హం. ఢిల్లీలో జరిగే పరిణామాల పట్ల ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొనే అతి కొద్దిమంది కొత్తతరం కాంగ్రెస్‌వాదులలో బొత్సా ఒకడు. ఆయనకు ఢిల్లీతో సత్సంబంధాలున్నాయి. రాహుల్‌గాంధీకి అత్యంత సన్నిహితుడైన నిజామాబాద్ ఎమ్పీ మధుయాష్కీ సైతం పిఆర్పి పొత్తును బహిరంగంగా సమర్థించడం గమనార్హం. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో ఈ పొత్తు ఫలించి, కాంగ్రెస్ చెప్పుకోదగిన ఫలితాలు సాధిస్తే, రెండు మూడు నెలల లోపలే, విజయవాడలో ఒక బ్రహ్మాండమైన సభ జరిపి, రాహుల్ గాంధీ సమక్షంలో ప్రజారాజ్యాన్ని కాంగ్రెస్‌లో విలీనం చేయాలని ప్రణాళిక వేసుకొన్నారట.

అయితే జగన్ శిబిరం చేసిన అల్లరి వల్ల కాంగ్రెస్ అగ్ర నాయకత్వం తాత్కాలికంగా ఇది ఆపేసింది.

## కడుపుతీపి

16వ పేజీ కొరవ

సంస్థ పెట్టి, సెల్ఫ్ ఫైనాన్స్ పద్ధతి క్రింద లక్షలలో ఫీజులు దండుతున్నారు. లెక్కా పక్కా లేదు. ఏటా కోటి రూపాయల పైన కాలేజీ సొత్తు వారి ఇళ్లకు చేరిపోతున్నదన్నది బహిరంగ రహస్యం. పవిత్రమైన విద్యాసంస్థ ప్రాంగణాన్ని యాజమాన్యమే వ్యభిచార కొంపగా మార్చింది. అడిగేవారు, అడ్డగించేవారు లేరన్న అహంకారంతో నానా భ్రష్టు పనులు చేస్తున్నారక్కడ. వాటితో పోలిస్తే ఒకరి పరీక్ష మరొకరు వ్రాయడమన్నది పెద్ద విషయం కాదు. కానీ అవేవీ బయటకు రాలేదు, ఇది మాత్రం కర్మ చాలక బట్టబయలైంది.

అధికారం ఇప్పటికీ వారి గుత్తసొత్తు కాబట్టి, దీనిపై విచారణ అన్నది తూతూ మంత్రమే తప్ప నేరాన్ని ధృవపరిచే తీరులో వుండదని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కానీ తాము అధికారంలో వున్నాము కాబట్టి తామేమీ చేసినా ఎవరూ ప్రశ్నించరాదనే అహంకారం మాత్రం క్షంతవ్యం కాదు.

## ఆడేది ఆమె...

16వ పేజీ కొరవ

ఈ సభలో డిసిసి అధ్యక్షుడు ఎల్లసిరి గోపాలరెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొనేట్లు చేయడంలో కూడా రామనారాయణరెడ్డి చొరవ చూపాడు. వెంకటగిరిలో సభ పెట్టడం అంటే, గుహలో నిద్రపోతున్న సింహం మీసాలు పట్టి లాగడం క్రిందేలెక్క అంత సాహసం ఎల్లసిరి వంటి రాజకీయ మరగుజ్జులకు మరొక జన్మ ఎత్తినా రాదు. వీటన్నిటికంటే విశేషం జనార్ధనరెడ్డి సోదరుడు నేదురుమల్లి పద్మనాభరెడ్డి కూడా ఇదే వేదిక ఎక్కి ఉపన్యసించడం. వయస్సు పెరిగే కొద్దీ బుద్ధి కుంచించుకపోతున్నట్లుంది ఆయనకు.

వెంకటగిరి సభతోనే పనబాక రాజకీయ నాటకానికి తెరపడడం లేదు. నిజమైన నాటకానికి ఇది ప్రారంభం మాత్రమే. ఇక నుంచి జిల్లాలో కాంగ్రెస్‌కు సంబంధించిన ప్రతి విషయాన్ని ఆనం, పనబాకలు సంయుక్తంగా నిర్వర్తించాలన్నది తీర్మానమట. స్థానిక సంస్థల ఎన్నికలలో టిక్కెట్ల దగ్గర నుంచి పార్టీ పదవుల వరకు అన్నిటిలో జనార్దనరెడ్డి ప్రాబల్యాన్ని నిరోధించడం వీరి అంతిమ లక్ష్యం. అందులో ఎంతవరకు సఫలీకృతులౌతారో వేచి చూద్దాం.

## నెల్లూరుముచ్చట్లు

3వ పేజీ కొరవ

పోవడం, ఈఏడాదే ఇవి చోటు చేసుకోవడంతో భక్తులు విస్తుపోతున్నారు.

## అల్లు అర్జున్ అభిమానుల రక్తదానం

నటుడు అల్లుఅర్జున్ నటించిన ఆర్య-2 సినిమా ఆడియో విడుదలను పురస్కరించుకొని నెల్లూరు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకులో 2తేది ఆయన అభిమానులు 50మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి, ప్రజా రాజ్యంపార్టీ నాయకులు కొటేదల సుధీర్, చిరంజీవి సేవాసమితి అధ్యక్షుడు కొట్టె వెంకటేశ్వర్లు, అల్లుఅర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.వంశీ పాల్గొన్నారు.

## అమృతవాక్కుల అస్తమయం

నెల్లూరు వేదసంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ అమృతవాక్కుల శేషకుమార్ (57) 2తేది మరణించారు. శేషకుమార్ కవి, పండితుడు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, సంస్కృత భాషల్లో ఎంఏ చేసిన సరస్వతీ పుత్రుడు. గోదావరి జిల్లాల నుంచి 1976లో ఇక్కడకు వచ్చిన ఈయన వేదసంస్కృత కళాశాలలో వివిధ హోదాల్లో పని చేసి ఎదగడంతోపాటు నెల్లూరు ప్రజల మనసుల్లో మంచి సాహితీస్రష్టగా పేరు తెచ్చుకొన్నారు.

## విలేకరి హనీఫ్ మరణం

చిత్రగుంటలో 20ఏళ్లపైబడి దినపత్రికల విలేకరిగా పనిచేస్తూ జనంలో మంచిపేరు తెచ్చుకొన్న మహమ్మద్ హనీఫ్ (49) 2తేది మరణించారు. కామెర్ల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం హనీఫ్ ప్రాణాలు తీసింది. రైల్వేశాఖలో జరిగిన పలు అవినీతి అక్రమాలతోపాటు తిప్ప దొంగల దయనీయజీవితాలను హనీఫ్ తన కలం ద్వారా లోకానికి చాటిన నిబద్ధత గల జర్నలిస్టు.

ఆత్మీయులను కోల్పోయిన పై రెండు కుటుంబాల వారికి మా సానుభూతి.

## కెవిపి మౌనరాగం

మొదటి పేజీ కొరవ

తులు వచ్చాయన్న మనస్తాపంతోనే కెవిపి మౌనరాగం పాటిస్తున్నాడని వినికిడి. ప్రభుత్వ కార్యకలాపాలలో కూడా ఇదివరకటి వలె ఆయన పెద్దగా జోక్యం చేసుకోవడం లేదు. రోశయ్య ముఖ్యమంత్రి అయిన మొదటి దినాలలో ప్రతిరోజూ సెక్రటరియేట్‌కు వచ్చేవాడు. ఇప్పుడు వారానికి ఒక రోజు కూడా కన్పించడం లేదు. గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ టిక్కెట్ల పంపకం పట్ల కూడా ఆయన ఆసక్తి చూపలేదు. కెవిపి లేకుండానే, డిఎస్, రోశయ్యలు కలిసి టిక్కెట్ల పంచాయితీ నడిపిస్తున్నారు.

## జనవాణి

2వ పేజీ కొరవ

కన్నా తీవ్రమైన అవినీతిని అంతమొందించకపోతే ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలి పోతుంది.

నాగరాజు, నెల్లూరు

### తెలుగులో మాట్లాడితే శిక్షిస్తారా?

కడప జిల్లా మైదుకూరులోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో తెలుగు మాట్లాడిన విద్యార్థులను స్కూల్ యాజమాన్యం దండించడం, మెడలో ఇక తెలుగు మాట్లాడమని బోర్డులు ధరింపజేయడం క్షమించరాని నేరాలు. ఇటువంటి పాఠశాలలు రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో వున్నాయి. వీరికి కనువిప్పు కలిగేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. తల్లితండ్రులు కూడా ఉపాధ్యాయులు, పిల్లలపైన ఇంగ్లీషులోనే మాట్లాడాలన్న ఒత్తిడి తేకూడదు. పాఠశాలలో దీన్ని ఒక భాషగానే నేర్చుకోవాలి.

సోలా జానకిదేవి, నెల్లూరు

# కాంగ్రెస్ - పిఆర్పీ పొత్తు సహ్యంకాదు!

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీనే ప్రధాన లక్ష్యంగా చేసుకొని ప్రజారాజ్యం పార్టీ ప్రచారం సాగించింది. ఇదే విషయాన్ని ఆ పార్టీ అధినేత చిరంజీవి కూడా ఎన్నికల ప్రచార సభల్లో ప్రకటించారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. ఎన్నికలు ముగిసి 5నెలలు గడవక ముందే హైదరాబాద్ గ్రేటర్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌పార్టీతో పొత్తు కుదుర్చుకునేందుకు పావులు కదిపింది.

ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీలో కొంత మంది నాయకులు ముఖ్యంగా జగన్‌వర్గం వ్యతిరేకించింది. రాష్ట్రవ్యాప్తంగా పిఆర్పీ-కాంగ్రెస్ పొత్తు వ్యవహారంపై తెలుగుదేశం, బిజెపి, సిపిఎం, సిపిఐ పార్టీల నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇరుపార్టీల మధ్య పొత్తు ఖరారవుతుందన్న విషయం తెలుసుకున్న జిల్లాస్థాయి నాయకులు శుభ పరిణామంగా భావిస్తున్నట్లు ప్రకటించారు. నిన్న మొన్నటివరకు కాంగ్రెస్‌పార్టీపై తీవ్ర విమర్శలు చేసిన చిరంజీవి ఇప్పుడు ఏమాశించి కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకుంటారన్న వాదన వినిపిస్తుంది.

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలను పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీతో ప్రజారాజ్యం పొత్తు పెట్టుకోవడాన్ని స్వాగతిస్తున్న, వ్యతిరేకిస్తున్న వివిధ పార్టీలకు చెందిన నాయకులు వెల్లడించిన అభిప్రాయాలను ప్రక్కనిస్తున్నాం.





### కాంగ్రెస్‌లో చేరడం ఖాయం



ప్రజారాజ్యం పార్టీ అధినేత చిరంజీవి కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుగా అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఇందులో భాగంగానే కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకునేందుకు చర్చలు జరిపారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ నాయకుల్ని పంచెలూడదీసి కొడతామన్న మాటలను మరచిపోయినట్లున్నారు.

-సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి,
టి.డి.పి జిల్లాఅధ్యక్షుడు.

### చారిత్రాత్మక తప్పిదం



కాంగ్రెస్‌పార్టీ ప్రజారాజ్యం పార్టీతో పొత్తు పెట్టుకోవడం చారిత్రాత్మక తప్పిదంగా చెప్పాలి. ఇది పూర్తిగా కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తుంది. ప్రజలే లేని ప్రజారాజ్యంతో అన్నివిధాలుగా బలంగా వున్న కాంగ్రెస్ పార్టీతో పొత్తు కుదుర్చుకోవడంపై అధిష్టానం ఆలోచించాలి. పొత్తు లేకుండా గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తే విజయం సాధిస్తుంది.

-కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.సి.సి కార్యదర్శి.

### శుభ పరిణామం



ప్రజారాజ్యం పార్టీ కాంగ్రెస్‌తో పొత్తుకుదుర్చుకోవడం శుభపరిణామంగా భావిస్తున్నాం. అధికారంలో వున్న కాంగ్రెస్ మద్దత్తు పిఆర్పీకి లభిస్తే భవిష్యత్‌లో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తాం. తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు పొత్తును జీర్ణించుకోలేక లేనిపోని ఆరోపణలు విమర్శలు చేస్తున్నారు.

-ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి,
నెల్లూరు నగర ఎమ్మెల్యే.

# మరుపూరు అవార్డుకు మనసు పులకిస్తుంది!

## అవార్డు స్వీకరణ సభలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కితాబు

సుప్రసిద్ధ సాహితీవేత్త, విమర్శకుడు దివంగత మరుపూరు కోదండ రామిరెడ్డి పేరిట సాహితీ అవార్డును నెలకొల్పారు. నెల్లూరు మాండలికంతో కూడిన వచన రచనలో తనకు తానే సాటి అని నిరూపించుకొన్న మరుపూరు పేరిట ఏర్పాటు చేసిన అవార్డును తొలిగా మరో నెల్లూరీయుడు, తన గంధర్వగానంతో శ్రోతలను మంత్రముగ్దులను చేస్తున్న ఎస్పీ బాలసుబ్రమణ్యంకు అందజేయడం విశేషం. నెల్లూరు ఇందిరాభవన్‌లో 1వ తేది జరిగిన సభలో బాలుకు మరుపూరు అవార్డును అందజేసింది అవార్డు కమిటి. అవార్డు గ్రహీత బాలసుబ్రమణ్యం మరుపూరు కోదండరామిరెడ్డి పేరిట నెలకొల్పిన అవార్డును తనకు అందజేసినందుకు ఎంతో పులకించిపోయారు. ప్రఖ్యాత సాహితీవేత్త అయిన మరుపూరు కోదండరామిరెడ్డి అవార్డు అందుకోవడం సంతోషంగా వుంది. ఎన్నో అవార్డులు అందుకొన్నా లభించని ఆనందం ఈ అవార్డుతో కల్గింది. మా నాన్న సాంబమూర్తి, మరుపూరు వారు మంచి స్నేహితులు. ఆయన నడిపిన మందాకిని పత్రికను చదివే అదృష్టం కల్గిందని వ్యాఖ్యానించాడు. అనంతరం ఆయన ఉపన్యాసం మాతృభాషపైకి మళ్లింది. ఇటీవల కాలంలో మాతృభాష అయిన తెలుగు మాట్లాడటం తగ్గిపోయిందని మాతృభాషలో మాట్లాడటం నామోషీ అయిందన్నారు. మాతృభాషకు ఇచ్చే గౌరవం, దానిని కాపాడుకోవడంలో కన్నడ ప్రజలను, తమిళులను చూసి నేర్చుకోవాలన్నారు. వేరే భాషలో మాట్లాడితే వారు సహించరని, తెలుగువారు మాత్రం ఆంగ్లం అధికంగా మాట్లాడుతుంటారని బాధపడ్డారు. మరుపూరు అవార్డు ఎప్పుడిచ్చినా నెల్లూరీయులకే ఇవ్వాలని అభిలషించారు. రూరల్ శాసన సభ్యుడు ఆనం వివేకానందరెడ్డి మాట్లాడుతూ ఎంత ఎదిగినా ఒదిగి వుండే వ్యక్తి బాలసుబ్రమణ్యం అని కొనియాడారు. గాయకుడిగా ఎంతో ఎత్తుకు ఎదిగినా సాంబమూర్తిగారబ్బాయి అనే చెప్పుకోవడం ఆయన మంచితనానికి నిదర్శనం అన్నారు. నగర శాసనసభ్యుడు ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి మరుపూరు విశిష్టతను, బాలసుబ్రమణ్యం కీర్తిని ప్రశంసించారు. మరుపూరు మనుమరాలు, స్మారక అవార్డు ఏర్పాటు చేసిన శైలజను ప్రముఖులు అభినందించారు. వచ్చే ఏడాది అవార్డును ప్రముఖ సినీరచయిత సింహపురీయుడు వెన్నలకంటి రాజేశ్వర ప్రసాద్‌కు అందజేస్తామని సభాముఖంగా ప్రకటించడంతో హర్షధ్వానాలు మిన్నుముట్టాయి. ఈ సందర్భంగా కవితల పోటీల్లో విజేతలకు బాలసుబ్రమణ్యం చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ భానుశ్రీ, బి.వి.నరసింహం తదితరులు పాల్గొన్నారు.



Regn.No. : RN 1156 / 57

J/Nellore/008/09-11

జమీన్‌రైతు

# పరువు కడిగిన కడుపుతీపి

- ప్రతి తరగతిలోనూ మాల్ ప్రాక్టీసుతోనే ఉత్తీర్ణత
- జీన్స్‌ప్యాంట్ అంటూ సరిగా రాయలేనివాడు ఎంబిఏ పాస్‌కాబోతున్నాడు
- తప్పుచేసి తమనెవరూ ప్రశ్నించరాదంటే ఎట్లా?

కన్న బిడ్డ మీద ఎవరికైనా ప్రేమ వుంటుంది. కాకిపిల్ల కాకికి ముద్దు. కానీ ప్రజాజీవితం గడిపేవారు ఒక్కొక్కసారి కడుపున పుట్టిన పిల్లల విషయంలో దోషులుగా నిలబడుతూ వుంటారు. "సన్ స్ట్రోక్" ధాటికి తల్లడిల్లడం ఇందిరమ్మ అంతటి ధీరోధాత్తురాలికే తప్పలేదు. ఇక మనమనగా ఎంత? జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పాపం, ఇప్పుడీ వడ దెబ్బ ఎదుర్కొంటున్నాడు.

ఆయన కుమారుడు ఆనం శుభకర్‌రెడ్డి అల్లారుముద్దుగా పెరిగిన బిడ్డ. కాలు క్రింద పెడితే కందిపోతాడని చేతుల మీద పెంచారు. అయితే ఎదిగే కొద్దీ ఆ పిల్లవాడి బుద్ధి అష్ట వంకరలు పోతున్నది. ఎన్నో అపసవ్య పనులు, ఆరోపణలు. పోనీలే పిల్లవాడని ఇప్పటివరకు ఎంత బద్ధశత్రువులు కూడా ఆ తప్పులను ఎంచలేదు. పట్టించుకోలేదు. తండ్రిని వేలెత్తి చూపించలేదు. అతి గారాబంగా పెరిగే పిల్లలకు చదువు అబ్బకపోవడం సహజ లక్షణం. కానీ ఆనం కుటుంబం చేతిలో ఏకంగా ఒక బృహత్తర విద్యాసంస్థ వుండడంతో చదువు వచ్చినా రాకపోయినా ప్రతి ఏటా పైతరగతికి ప్రమోషన్ దానంతట అది వచ్చేస్తున్నది. ఇంతకాలం దాన్నెవరూ పట్టించుకోలేదు.

అయితే, 2006లో శుభకర్‌రెడ్డికి సంబంధించిన పరీక్షా పత్రం ఒకటి స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్తలు కొందరికి దొరికింది. విఆర్ కాలేజీలో బికాం కంప్యూటర్స్ పరీక్షకు ఆ పిల్లవాడు వ్రాసిన సమాధానపత్రం అది. దాన్ని చూసిన వారికెవరికైనా నవ్వు ఆగదు. జీన్స్ ప్యాంట్, క్యాబరే డ్యాన్స్ వంటి పదాలు తప్ప ఆ పత్రంలో ఒక్క ప్రశ్నకు సమాధానం లేదు. కానీ శుభకర్‌రెడ్డి బికాం పాసయ్యాడు. ఇప్పుడు ఎంబిఎ కూడా పాసు కాబోతున్నాడు. ఇటువంటి విచిత్రాలు విఆర్ కాలేజి యాజమాన్యానికి, ఆనం కుటుంబానికి అలవాటే. పరీక్ష జరిగే సమయంలో ఈ పిల్లవాడు బుద్ధిగా లోపల కూర్చొనేవాడట. ఆ మూడు గంటలపాటు పేనాతో తోచిన పిచ్చి గీతలు గీస్తూ కాలం గడిపేసేవాడట. అదే సమయంలో, అదే కాలేజీకి చెందిన అధ్యాపకులు వేరొకచోట కూర్చొని ఆ పరీక్ష తాము వ్రాసేవారు. చివరన, అందరి సమాధానపత్రాలు సేకరించే చీఫ్ ఎగ్జామినర్, ఈ పిల్లవాడు వ్రాసిన పత్రాన్ని బయటపడేసి, అయ్యవార్లు వ్రాసి పెట్టిన పత్రాన్ని గుట్టుగా ఆ కట్టలో కలిపేసేవాడట. పదవ తరగతి నుంచి జరుగుతున్న ఈ తంతు ఎప్పుడూ బయటకురాలేదు. కానీ బికాం పరీక్ష సమయంలో ఎక్కడో జరిగిన చిన్నపొరపాటు వల్ల అసలు సమాధాన పత్రం చెత్తబుట్టకు వెళ్లడానికి బదలు ఎస్ఎఫ్ఐ కార్యకర్తలకు దొరికింది. ఆ పిల్లవాడు ఆ పత్రం వ్రాసింది జీన్స్‌ప్యాంట్, క్యాబరే డ్యాన్స్ వంటి పదాలు మాత్రమే. ఆ చిన్న పదాలు ఎట్లా వ్రాయాలో కూడా తెలియలేదు. ఈ పక్కన ఆ పిల్లవాడు వ్రాసిన సమాధాన పత్రంలోని ఒక భాగం వుంది, చూడండి.

కష్టపడి పరీక్ష వ్రాసే తమకు పాసు మార్కులు రావడమే గగనమైతే, అసలు చదవడం, వ్రాయడం రాని ఆనం కుటుంబ ముద్దుబిడ్డ కాలేజీ ఫస్ట్‌గా సన్మానాలు అందుకోవడం వారికి కడుపు మండించింది. ఈ అసలు సమాధాన పత్రాన్ని ప్రభుత్వానికి పంపుతూ, ఫిర్యాదు చేశారు. హాల్‌టిక్కెట్ నంబరుతో సహా స్పష్టంగా తప్పు బయటపడిపోయింది. అయితే, వైఎస్ ప్రభుత్వం నడిచినన్నినాళ్లు ఆయన ప్రభుత్వంలోని ఒక మంత్రి మీద విచారణ జరిపే ధైర్యం ఏ అధికారికీ లేదు కాబట్టి, ఎస్ఎఫ్ఐ ఎన్ని విజ్ఞాపనలు పంపినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడా భయాలు తొలగిపోవడంతో వున్నత విద్యాశాఖ అధికారి ఒకరు దీనిపై దర్యాప్తు జరపమని ఆదేశించారు. దానితో అతి రహస్యం కాస్తా బట్టబయలైపోయింది.

వ్యక్తుల ప్రైవేటు జీవితాలు వారి స్వంతం. పబ్లిక్‌లోకి వస్తే ఏమైనా అంటాము... అన్నాడు మహాకవి శ్రీశ్రీ. ఆనం రామనారాయణరెడ్డి ప్రజాజీవితం గడిపే రాజకీయవాది. ఏ చిన్న తప్పు దొరికినా విమర్శకులు వదిలిపెట్టరు. లల్లూప్రసాద్ యాదవ్ అంతటివాడే తన కుమార్తె పరీక్ష విద్య విషయంలో విచారణ ఎదుర్కోక తప్పలేదు. అది సహజం. కానీ ఆనం సోదరులు మాత్రం ఈ తప్పును బయటపెట్టిన వారు ఏదో పెద్ద నేరం చేసినట్లు ఆడిపోసుకొంటున్నారు. తమ మీద కోపం తమ పిల్లల మీద చూపుతున్నారని ఉక్రోషపడుతున్నారు. ఎమ్మెల్యే వివేకానందరెడ్డి పత్రికా విలేకరుల సమావేశం పెట్టి, ఈ తప్పు ఎత్తి చూపిన వారిని బండ బూతులతో తిట్టిపోశాడు. వారు సాధారణ వ్యక్తులైతే దీనికింత ప్రాధాన్యత వచ్చేది కాదు. కానీ ఒక పక్క రాజకీయ అధికారం, మరొకప్రక్క విఆర్ కాలేజి ఆధిపత్యం వారి చేతిలోనే వుండడం వల్ల ఇటువంటి నేరాలకు సమాధానం చెప్పక తప్పదు.



శుభకర్‌రెడ్డి వ్రాసిన జవాబు పత్రమిది.

విఆర్ కాలేజికి రామనారాయణరెడ్డి అధ్యక్షుడు, వివేకానందరెడ్డి కార్యదర్శి. అంతా వారి పెత్తనమే. గత పది పన్నెండేళ్లుగా అక్కడ జరుగుతున్న అరాచకాలు అన్నీ ఇన్నీ కావు. ఎంబిఎ, ఎంసిఏ వంటి వృత్తి విద్యా కోర్సులకు ప్రత్యేక

కొరవ 14వ పేజీలో

# ఆడేది ఆమె... ఆడించేది ఆయన!





**వెంకటగిరి సభతోనే పనబాక రాజకీయానికి తెరపడడం లేదు. ఇక నుంచి జిల్లాలో కాంగ్రెస్‌కు సంబంధించిన ప్రతి విషయాన్ని ఆనం, పనబాకలు సంయుక్తంగా నిర్వహించాలన్నది తీర్మానమట.**

జిల్లా రాజకీయాలపై పట్టు సాధించడానికి కేంద్ర మంత్రిణి పనబాక లక్ష్మి మరొకసారి ప్రయత్నాలు ప్రారంభించారు. ఐదేళ్ల క్రితం తొలిసారిగా మంత్రి పదవి చేపట్టినప్పుడే ఆమె అందుకు శ్రీకారం చుట్టారు. జిల్లా రాజకీయాలను గత ముప్పైఏళ్లుగా ఏకఛత్రాధిపత్యంగా ఏలుతున్న నేదురుమల్లి జనార్దనరెడ్డి తరం అంతరించి పోతున్నది కాబట్టి, ఆయన తర్వాత ఈ జిల్లా నుంచి ఢిల్లీదారులు తెలిసినవాడు ఒక్కడూ లేడు కాబట్టి, ఆ అనుపానులు జీపోసన పట్టిన తానే పెత్తందారు కావాలని కలలు కన్నారామె. అప్పట్లో రాష్ట్ర మంత్రిత్వాలు ఆశించి భంగపడిన ఆనం సోదరులు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితర ఎమ్మెల్యేలు ఆమెను బాగా ప్రోత్సహించారు. ఆమె తమ నాయకురాలని చెప్పుకొన్నారు, కోటలో జరిగిన ఒక సభలో అయితే ఆనం వివేకానందరెడ్డి ఆమెను విప్లవ నారిగా అభివర్ణించాడు. అయితే ఈ దరువు ఎక్కువకాలం సాగలేదు. వైఎస్ క్యాబినెట్‌లో తనకు స్థానం దక్కడంతో ఆనం రామనారాయణరెడ్డికి పనబాక అవసరం తీరిపోయింది. నది మధ్యలో పుట్టి ముంచినట్లు, పనబాకను వదలి వెళ్లిపోయారు. ఆ తర్వాత నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గం జనరల్ కావడం వంటి పరిణామాల వల్ల ఆమె జిల్లా వదలి పెట్టి వెళ్లవలసి వచ్చింది.

అయితే వైఎస్ మరణంతో జిల్లా రాజకీయ స్వరూపం మరొకసారి మార్పులకు లోనౌతున్నది. ముఖ్యమంత్రి తమ జేబులో వున్నాడన్న నమ్మకంతో ఆనం సోదరులు జిల్లా మీద పెత్తనం మొత్తం తమదే అన్నట్లు వ్యవహరించారు. నేదురుమల్లి జనార్దనరెడ్డి అనే నాయకుడు ఒకరు ఈ జిల్లాలో వున్నారన్న స్పృహలేనట్లు ప్రవర్తించారు. తమకేమాత్రం సంబంధం లేని సూళ్లూరుపేట, గూడూరు, కోవూరు వంటి నియోజకవర్గాలలోనూ నేరుగా వేలు పెట్టారు. అక్కడి కాంగ్రెస్‌వాదులను తమ వద్దకు పిలిపించుకొన్నారు. రోశయ్య ముఖ్యమంత్రి కావడంతో వారికి ఒక్కసారిగా దిక్కు తోచని పరిస్థితి. రోశయ్యతో వారికి పెద్దగా సంబంధాలు లేకపోవడం అటుంచి, అసలు ఆయన తమను మంత్రివర్గంలో వుంచుతాడో, పీకి పారేస్తాడో అన్న అనుమానంతో సతమతౌతున్నారు. అదే జరిగితే తాము రాజకీయ అనాథలుగా మారిపోతామన్న భయం పట్టుకొన్నది. ఆ సమస్యకు పరిష్కారంగా పనబాక లక్ష్మిని మరొకసారి జిల్లా తెరమీదకు దిగుమతి చేశాడు ఆనం రామనారాయణరెడ్డి.

కేంద్ర జౌళిమంత్రిణి హోదాలో, వెంకటగిరిలో చేనేతకారులతో ఒక కార్యక్రమం తలపెట్టింది పనబాక. నిజానికి ఆమెకు, వెంకటగిరికి ఏ సంబంధం లేదు. అక్కడ ఒక మనిషి తెలియదు. 1983 నుంచి ఆ నియోజకవర్గం నేదురుమల్లి కుటుంబ గుత్తసొత్తుగా చలామణి అవుతున్నది. కొడితే కుంభస్థలంలో కొట్టాలన్నట్లు, నేదురుమల్లి ప్రాభవాన్ని సవాలు చేయడానికి వెంకటగిరిని ఎంపిక చేసుకొన్నారామె. దీనికి పూర్తిసహకారం అందించారు ఆనం సోదరులు. రాపూరు, కలువాయి, సైదాపురం వంటి తమకు ప్రాబల్యం వున్న మండలాల నుంచి జనాన్ని తరలించారు. అందుకయ్యే మందు మాకు ఖర్చు తామే పెట్టుకొన్నారు. పనబాకకు జిల్లా మీద పట్టు దొరికితే ఒకవేళ రోశయ్య నుంచి తమకు ఇబ్బందులు ఎదురైనా, ఢిల్లీ స్థాయిలో ఆమె ద్వారా తమకు ఆశ్రయం దొరుకుతుందన్నది వారి ఆశ. అందుకే ఆమె తెరమీద ఆడుతుంటే, వారు వెనుక నుంచి ఆడిస్తున్నారు.

కొరవ 14వ పేజీలో

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.